ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి

## SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

**సంపుటి/Vol : 97 ఫిబ్రవరి/February : 2021 సంచిక/No : 2**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – శ్రీ ఆదిశంకరాచార్య విరచిత శ్రీ వాగ్దేవీ స్తోత్రమ్ | 2 |
| 2. | ధ్యానము – స్వామి తపోవన్ మహరాజ్ | 3 |
| 3. | ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 4 |
| 4. | సూర్యస్తుతి – మల్లాది శ్రీహరిశాస్త్రి | 9 |
| 5. | ఆనందము – స్వామి ఓంకార్ | 10 |
| 6. | దేవ్యుపాసనా ఫలము – జగద్గురు పరమాచార్యులు | 11 |
| 7. | ధనపిపాస – అనువాదం : డా॥ గరిగిపాటి కన్యాకుమారి | 14 |
| 8. | కొబ్బరికాయ కథ – అనువాదం : గరిగిపాటి కృష్ణ | 16 |
| 9. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శర్మ | 19 |
| 10. | సూర్యదేవ నమోస్తుతే – శ్రీమతి వాడ్రేవు శారద | 23 |
| 11. | వివేక వైరాగ్యములు – సిలువేరు సుదర్శన్ | 25 |
| 12. | విజ్ఞప్తి – గో సంతతికై గోశాల విస్తరణ | 28 |
| 13. | వార్తలు – విరాళములు | 29 |

** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు.*

**జీవిత సభ్యత్వం (12 సం.) : రూ. 1000/- సాలుసరి చందా : రూ. 100/-**



# ప్రార్థన

**శ్రీ ఆదిశంకరాచార్య విరచిత శ్రీ వాగ్దేవీ స్తోత్రమ్**

**భగవంతుని పొందుటకు మాత్రమే ప్రార్థించాలి**

ఆచార్య శంకరులు తమ "ప్రపంచసారతంత్రం" అనే తంత్రశాస్త్ర గ్రంథంలో సరస్వతీ తంత్రం వ్యాఖ్యానించి సరస్వతీహోమాదులు పూర్తయిన తర్వాత చేయవలసినదిగా ఈ "వాగ్దేవిస్తోత్రము"ను రచించారు.

శ్లో. 1 **అమల కమలాధివాసిని!**
**మనసో వైమల్యదాయిని! మనోజ్ఞే! ।**
**సుందరగాత్రి! సుశీలే!**
**తవ చరణాంభోరుహం నమామి సదా॥**

తా॥ శుభ్రవర్ణమయిన కమలములో ఆసీనురాలయినదానా! మనస్సును గూడ శుభ్రముగా చేయుదానా! మనోహరమయినదానా! సుందర స్వరూపము గలదానా! సాధుస్వభావము గలదానా! నిత్యము నీ చరణకమలములకు నమస్కారము చేసెదను.

శ్లో. 2 **అచలాత్మజా చ దుర్గా**
**కమలా త్రిపురేతి భేదితా జగతి।**
**యా సా త్వమేవ వాచా**
**మీశ్వరి! సర్వాత్మనా ప్రసీద! మమ ॥**

తా॥ పర్వతరాజపుత్రి అని, దుర్గ అని, పద్మ అని, త్రిపుర సుందరి అని ప్రపంచంలో భిన్ననామాలు గల మహాశక్తివి నీవే! ఓ వాగీశ్వరీ! నాయందు సర్వవిధముల అనుగ్రహము చూపుము.

ఓంకార – ఓంకార – పరమపూజ్య సద్గురు ఓంకార – 4
1. కాషాయాంబర వేషధార – కరుణా హృదయ ఓంకార – 4
ఓంకార – ఓంకార – పరమపూజ్య సద్గురు ఓంకార
2. శాంతి ఆశ్రమస్థాపక – పీడిత జన సంరక్షక – 4
ఓంకార – ఓంకార – పరమపూజ్య సద్గురు ఓంకార
3. సజ్జన సన్నుత ఓంకార – సాధుజన ప్రియ ఓంకార – 4
ఓంకార ఓంకార పరమపూజ్య సద్గురు ఓంకార
4. త్యాగమూర్తి ఓంకార – ప్రేమావతార ఓంకార – 4
ఓంకార ఓంకార పరమపూజ్య సద్గురు ఓంకార
5. స్వామి శివానంద ఓంకార – స్వామి చిదానంద ఓంకార – 4
ఓంకార – ఓంకార – పరమపూజ్య సద్గురు ఓంకార
6. అనాధ రక్షక ఓంకార – ఆపద్బాంధవ ఓంకార – 4
ఓంకార – ఓంకార – పరమపూజ్య సద్గురు ఓంకార

**శ్రీ కోదండ రామాచార్యులు, మారుతీ భక్త బృందము**

# ధ్యానము

**స్వామి తపోవన్ మహరాజ్**

**పవిత్ర భావాన్ని ధ్యానించడం మంచిది**

శ్లో॥ ఓంకారాత్మా మహానిద్రః ప్రజ్ఞా ప్రజ్ఞాన మేవచ ।
యో దదాతి తదర్థిభ్య స్తం వందే కాశికాపతిమ్ ॥

ఓంకార స్వరూపుడైన, పరమాత్మ జపపూజాదుల వల్ల ఆరాధింపబడినప్పుడు ఆయన తగిన వివేకాన్ని ప్రసాదించుతాడు. ఆవివేకం ద్వారా ఏ పరమపద శుద్ధచైతన్యాన్ని భక్తుడు తన మనోవాంఛితానుసారం అందుకొంటాడో ఆ సౌమ్య కాశీశునికి నేను నమస్కరిస్తాను.

**వ్యాఖ్య**

శ్రీ గురుదేవులు ఈ శ్లోకం నుండి తైత్తిరీయోపనిషత్తులోని భావాలను ఉపయోగిస్తున్నారు. తైత్తిరీయం కృష్ణయజుర్వేదంలో ఉన్నది. అందులోని భావాలు మూడువల్లులు అంటే మూడు తీగెలుగా సాగుతుంది – శిక్షావల్లి, బ్రహ్మానందవల్లి, భృగువల్లి అనేవి ఆ మూడు. ఎనిమిది, తొమ్మిది శ్లోకాలలో శ్రీ స్వామీజీ మొదటి వల్లిలోని నాలుగో అనువాకంలోని బోధను చాలా సన్నిహితంగా అనుసరిస్తారు. ఓంకారోపాసన వల్ల చురుకైన, తేజోవంతమైన బుద్ధిని కోరినవారు దానిని, అంతరంగిక సంపదని కోరుకున్నవారు దానిని పొంది తద్వారా ఆధ్యాత్మిక జీవితంలో అత్యున్నతస్థాయిని చేరవచ్చును.

ఈ శ్లోకంలో ఉదహరించబడిన అనువాకంలో ఋషి ఓంకారోపాసన విషయం తెలుపుతున్నారు. జప, హోమ పూజాదుల ద్వారా ఓంకారం ఉపాసింప బడినప్పుడు సాధకుడు తాను కోరుకునే ప్రజ్ఞను నైతిక విలువలను పొందగలడు. ధ్యానంలో విజయవంతంగా నిలిచి శుద్ధచైతన్య పదాన్ని చేరడానికి ప్రజ్ఞ, నైతిక విలువలు చాలా అవసరం.

ఆ ఓంకారసారం సౌమ్య కాశీశుడు. ఆయనను నేను ఆరాధించి నమస్కరిస్తాను.

“సమేంద్రో మేధయా స్పృణోతు” అమృతస్యధారణో భూయాసమ్” వంటి మంత్రాలను ప్రతిభావంతమైన బుద్ధిని కోరుకొనేవాళ్ళు జపించాలని ఉపనిషత్తు సందేశం. తైత్తిరీయంలోని అతి సూక్ష్మమైన బోధన లోతుగా అధ్యయనం చేసి తెలుసుకోవడానికి ఇది అవసరం. (తైత్తిరీయ 1.4.1)

కేవలం బుద్ధితో గ్రహిస్తే చాలదు. మనలో సరైన విలువలు, నైతిక ఆధ్యాత్మిక సంపద కావాలి. దానినే “లక్ష్మి” అంటారు. వీటిని కూడా మనం ఓంకారం వల్ల పొందవచ్చును.

> దైవానుభవము అనునది సత్సంగములో కూర్చున్నంత మాత్రమున లభించదు. మనస్సును మథించి ఆచరణలో నిరంతర సాధన చేసినప్పుడే ఆ దివ్యానుభూతి లభించును.
>
> **– స్వామి ఓంకార్**



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

**అధ్యాయం - 24**

## ప్రకృతి సందర్శనానికై విహారయాత్ర

**నా ప్రతి శ్వాసలో భగవంతుని గుర్తించగలుగుతున్నాను**

అంతర్వాణి పిలుపునందుకొని, అది చెప్పినట్లుగా నడుచుకునేవారికి స్వేచ్ఛ లభిస్తుంది. నాగరిక ప్రపంచపు గుహల్లో తిరిగేవాళ్ళకి, ఆధునికత వ్యామోహంలో చిక్కుకుపోయి అలాగే ప్రవర్తించేవారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించవు. ఎవరయితే నిరాడంబరంగా, పవిత్రంగా జీవిస్తారో వారికి భగవంతుని ఆశీర్వచనాలు లభిస్తాయి.

ఒకరోజు విపరీతంగా వర్షం కురుస్తోంది. నాకు అప్పుడు బయటికి వెళ్ళి వీధుల్లో, ఫిలడెల్ఫియాలోని ఉద్యానవనాల్లో స్వేచ్ఛగా, హాయిగా తిరిగి రావాలి అనిపించింది. ఒక దేశదిమ్మరిలాగా నా గతాన్ని మర్చిపోయి, భవిష్యత్తును గురించిన ఆలోచనలు కొంచమయినా లేకుండా స్వేచ్ఛగా తిరగాలనిపిస్తోంది. ఈ క్షణంలో జీవించేవారే ఆ ఆనందాన్ని అనుభవించగలరు. ఒక్కో సమయంలో అన్ని బాధ్యతలు, కర్తవ్యాలు, పనులు వదలిపెట్టి స్వేచ్ఛగా, ఎలాంటి బాదరబందీ లేకుండా కొద్దిసేపు గడపాలనిపిస్తోంది.

ఆ రోజు బాగా మబ్బులు పట్టి ఆకాశం వెలుతురు లేకుండా ఉంది. సూర్యుడు మబ్బుల చాటున కనుమరుగయిపోయాడు. కాని నా హృదయంలో సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. నేను బయటికి వెళ్ళి ప్రకృతి ఒడిలో గడపాలనుకున్నాను. అయితే ప్రకృతి భయానకంగా నా కోరికకి విరుద్ధంగా విపరీతమయిన వర్షం కురిపిస్తోంది. కానీ నా ఆత్మని ఇంటి గది గోడలు బంధించలేకపోయాయి. నేను స్వేచ్ఛగా బయటి వాతావరణంలో తిరిగి రావాలనుకున్నాను. నా పాత కోటు, బూట్లు, తలపై టోపీ ధరించి బయటపడ్డాను. నా జేబుల నిండా బాదం పప్పులు, వేరుశనగ పప్పులు నింపుకొని వాటని తింటూ వర్షంలో తడుస్తూ రోడ్లు వెంట నడవసాగాను. చిన్నపిల్లాడిలా నా మనస్సు ఆనందంగా ఉంది. ఆ వర్షంలో తడుస్తూ ఆనందంతో పాటలు కూడా పాడాను.

**ఈ వర్షం నా కోసం కురవటం లేదు డాఫడిల్స్ కోసం కురుస్తోంది**
**ఈ వర్షం నా కోసం కురవటం లేదు రోజాపూల కోసం కురుస్తోంది**

ఓ! ఎవరు వర్ణించగలరు? ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడంలో ఎంత దివ్యత్వం ఉంది! నేను అలా ఎన్నో వీధుల్లో తిరుగుతూ నడుస్తూ చివరికి జార్జి కొండపైనున్న ఫెయిర్‌మౌంట్ పార్కు చేరుకున్నాను. నా విహారయాత్రని పూర్తి చేయడానికి ఒక ఐస్‌క్రీమ్ కొనుక్కొని ఆ వర్షంలోనే తిన్నాను. తర్వాత కొండమీదకి మెట్ల మీదుగా ఎక్కేటప్పుడు ఓంకారాన్ని జపిస్తూ ప్రతి మెట్టు ఎక్కాను.

నా ఆనందానికి హద్దులు లేకుండా ఉంది. నేను ఒక్కడినే ప్రకృతిలో లీనమయిపోయాను. ఎంతో ప్రేమతో నా చుట్టూ ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ కళ్ళ వెంట నీరు కార్చాను. నడక దారిలో ఒక చిన్న పురుగు నెమ్మదిగా ప్రాకుతూ వస్తోంది. ఎవరయినా దాన్ని తొక్కుతారనిపించి నెమ్మదిగా ఆ సోదరుడిని పక్కనున్న గడ్డిలో వదలిపెట్టాను. అందరి జీవితాలు ఒక్కటే కదా! ప్రకృతిని ఆరాధించాలి, అంటే విశ్వంలోని ప్రతి జీవిని ప్రేమించగలగాలి. దేవదూత అయినా, మానవుడు అయినా చిన్న పురుగు అయినా అంతా సమానమే కదా! బయట వర్షం ధారాపాతంగా కురుస్తోంది. నా అంతరంగంలో శాంతి వర్షం వర్షిస్తోంది.

అలా తిరుగుతుండగా ఒక అందమయిన చెట్టు క్రింద కూర్చోవడానికి బల్ల కనబడింది. వర్షం వలన అది బాగా తడిసిపోయి ఉంది. నాకు దాని మీద కూర్చొని నా మధ్యాహ్న భోజనము చేయాలని కోరిక కలిగింది. దాన్ని నేను ఆపుకోలేకపోతున్నాను. నా చేతి రుమాలు ఆ బల్లపై పరుచుకొని హాయిగా కూర్చుని ఆనందంగా నా జేబులు ఖాళీ చేశాను. మహాద్భుతమయిన శాంతి తరంగాలు నా హృదయం నిండా, నా చుట్టూ పరచుకున్నాయి. భగవంతుని దయ నా మీద వర్షిస్తోంది.

పక్షులు కిలకలరావాలు చేస్తూ నా కోసమే పాడుతున్నట్లుగా ఉంది. అక్కడ అందమయిన పుష్పాలు నా కోసమే వికసించాయి అనిపిస్తోంది. చల్లని పిల్లగాలులు నా కోసమే వీస్తున్నట్లుగా ఉంది. కేవలం నా కోసమే వర్షం చిరుజల్లులు కురిపిస్తుంటే పుష్పాలు ఆనందంగా తలలాఊపుతున్నాయి. నిజంగా స్వర్గలోకంలో ఉన్నట్లుగా భావన కలిగింది. నెమ్మదిగా నేను బాహ్య స్మృతి కోల్పోయాను. నేను నా కాళ్ళు చేతులు కదిలించడానికి ప్రయత్నించాను కాని ప్రపంచ స్థితి కల్గలేదు. కాని లెక్కలేనన్ని గడ్డిపోచలు లాగా మానవుని జీవితం కూడా అలాగే తృణపాయం కదా అనిపించింది. నామరూపాలు కనుమరుగయిపోయాయి. మానవుని గొప్పతనము ఏముంది సృష్టిలో? గడ్డిపోచకి, పుష్పాలకి సృష్టిలోని ఇతర జీవులకి ఏ విధంగా వినాశనం సంభవిస్తుందో, మానవుని భౌతిక జీవితం కూడా అలాగే అంతమవుతుంది. జీవుడు తన నీడ వెంట పరుగెత్తి పరుగెత్తి దివ్య జీవనానికి దూరమయిపోతున్నాడు. నాకు ఆ గడ్డి మీద కాలుపెట్టాలంటే కూడా బాధగా అనిపిస్తోంది. ఎందుకంటే సృష్టిలోని ప్రతి అణువులో నేను ఏకత్వాన్ని అనుభవిస్తున్నాను. అలాంటి భావ రహిత స్థితిలో చాలాసేపుండిపోయాను. తెలియకుండానే నా మనస్సు పలుకుతోంది. “ప్రియమయిన గడ్డిపోచల్లారా! హాయిగా జీవించండి. సున్నితమయిన పుష్పాలు ఆనందంగా వికసించాలి. నన్ను సృష్టించిన భగవంతుడే మిమ్మల్ని కూడా సృష్టించాడు. ఆయనే అందరికీ జీవనాధారం. అందుచేత నేను నీ మీద కాలు కూడా పెట్టలేను? ఓ గడ్డిపరకా! హాయిగా, ఆనందంగా జీవించండి నా అమూల్యమయిన మిత్రులారా!”

కొంతసేపటికి నేను మామూలు స్థితికి వచ్చాను. నెమ్మదిగా ఆ పార్కులో రహదారి వెంట నడుస్తూ వస్తుండగా ఒకచోట ఒక వ్యక్తి దిగాలుగా నిలుచుని తన కారు వంక చూస్తుండటం గమనించాను. అతని కారు టైరు పంక్చర్ పడింది. రెండవది కూడా లేకపోవడం వలన ఏమి చేయాలో దిక్కుతోచక ఆకాశం వంక చూస్తూ దిగాలుగా ఉన్నాడు. అతనికి శాంతి కల్గుగాక!



ప్రతిరోజూ యథావిధిగా ప్రారంభమవుతుంది. రోజు గడిచి ముగిసిపోతుంది. మానవుని జీవితంలో ఎప్పుడు, ఏ నిముషంలో ఏమి జరుగుతుందో తెలియదు. అది తామరాకు మీద నీటి బిందువులాగా అనిశ్చితంగా, అస్థిరంగా ఉంటుంది. అయినా దాన్ని గ్రహించలేని మానవుడు ఎండమావుల వెంట పరుగెత్తినట్లుగా భౌతిక సుఖాల కోసం తన నీడ వెంట తానే పరుగెత్తుతాడు తప్ప ఎన్నటికీ శాంతిని పొందలేడు. కేవలం కొద్దిమంది మాత్రమే పరమాత్మ గురించి పరితపిస్తారు. అలాంటి వారికే మనశ్శాంతి దొరుకుతుందని గ్రహించాలి.

నేను ఆ ఉద్యానవనంలో అలాగే తడుస్తూ వ్యవసాయ ప్రాంతంలోకి వచ్చేసరికి బాగా అలసిపోయి ఒక బల్లపై కూర్చుండిపోయాను. కనుచూపుమేర చాలా ఆహ్లాదకరంగా అందంగా ఉంది. గుత్తులుగా వ్రేలాడుతున్న అందమైన పుష్పాలు ప్రధాన ద్వారానికి ఇరువైపులా బాగా పెరిగిన అందమయిన చెట్లు, మధలో నీటి కొలనులు, వాటిలో తామరమొగ్గలు ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఆ ఉద్యానవనాన్ని అక్కడక్కడా చాలా అందమైన శిల్పాలు, చుట్టూ పచ్చని తివాచీ పరచినట్లుగా అందమైన గడ్డి లాన్ ఉంది.

అవన్నీ చూస్తున్న నా మనస్సు సంతోషంతో, ఆనందంతో స్వర్గలోకంలో ఉన్నట్లుగా తేలిపోసాగింది. ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. అప్పుడప్పుడు పక్షులు తీయని, మధురమైన సవ్వడులు చేస్తున్నాయి. స్వేచ్ఛగా, హాయిగా ఎగురుతున్నాయి. రాజులు, చక్రవర్తులు కూడా పొందలేనటువంటి ఆనందాన్ని పొందుతున్నాను నేను. అసలు ప్రపంచంలో అందరికంటే సంతోషంగా ఉండే వ్యక్తి ఎవరు? అది తప్పకుండా ‘నేనే’. ఇక్కడ నేను అంటే వ్యక్తిగతమైన నేను కాదు. అది విశ్వానికి చెందిన ‘నేను’. ఆ నేను అనేది పరిమితులు లేనిది. అంతటా నిండి ఉండేది. నామరూపాలు లేనటువంటిది. అది లోపలా, బయటా కూడా నిండి నిబిడీకృతమై ఉంది. చిన్న గడ్డిపరక మొదలుకొని మహా వృక్షానికి భేదము లేకుండా సృష్టి అంతా ఒక్కటై ఉంది. దానికి అంతము లేదు.

నా శరీరం చాలా తేలిగ్గా, హాయిగా ఉంది. అసలు నాకు భౌతిక శరీరం లేనట్లుగా ఉంది. నా భౌతిక శరీరం స్పృహలేని స్థితిని నిర్ధారించుకోవడానికి నా వైపు నేను చూసుకున్నాను. నా శరీరంపైన పెద్ద కోటు ఉంది. ఇప్పుడు నాకు ఆ దుస్తుల పట్ల కూడా స్పృహ లేదు. శరీరానికి దుస్తులు ఏ విధంగా ఒక తొడుగులాగా ఉందో, నా ఆత్మకు కూడా ఈ శరీరం ఆ విధంగా ఒక తొడుగులాంటిదని అర్థమయింది. నా శరీరము దానిపైన వేసుకున్న దుస్తులు నాకు చెందుతాయి, కాని వాటితో నాకు ఎలాంటి సంబంధము లేదు. ఇలాంటి విచిత్రమైన స్థితిలో చాలాసేపుండి పోయాను.

అలాంటి భావాతీత స్థితిలో శరీరస్థితి తెలియకుండా నిర్వికల్ప సమాధి స్థితిలో ఆనందంలో మునిగి తేలుతూ ఎంతకాలం గడచిపోయిందో తెలియకుండా అంతర్ముఖ స్థితిలో ఉండిపోయాను. నాకు నేను జీవిస్తున్న సత్యంలాగా భావిస్తున్నాను. స్వర్గలోకపు తండ్రికి నాకు అభేదాన్ని పొందాను. నేను నా కుటిప్రక్కకు తిరిగి చూచాను. సింహాసనాన్ని అధిష్ఠించి క్రీస్తు భగవానుడు దర్శనమిచ్చాడు. కాని ఆయన అక్కడ లేరు. నేను నా హృదయంలో ఆయన సన్నిధిని దర్శిస్తున్నాను. పవిత్రమయిన అంతరంగంలోనే భగవంతుడు స్థిర నివాసం

ఏర్పరచుకున్నాడు. అంతేకాని వేరే ఎక్కడో స్వర్గంలో భగవంతుడి నివాసం ఉండదు కదా!

నెమ్మదిగా నా ఊపిరి తగ్గిపోతూ వచ్చి చివరికి నిశ్చలస్థితిని పొందింది. అలాంటి శ్వాసరహిత స్థితిలో ప్రతి శ్వాస ఒక క్రొత్త జీవితం లాగా అనిపించింది. ఎంత గొప్ప ఆలోచన?! ప్రతి శ్వాస ఒక క్రొత్త శ్వాస జీవితం లాగా అనిపించింది. ఎంత గొప్ప ఆలోచన?! ప్రతి శ్వాస ఒక క్రొత్త జీవితానికి పునాది. నిజంగా ఎంతో విలువయిన జీవితాన్ని మనం సద్వినియోగం చేసుకుంటున్నామా? మనం ఎంతో జాగ్రత్తగా ప్రతి పవిత్రమయిన శ్వాసని ఒక జన్మగా భావించాలి. నేను ఇంకా ఇంకా గాఢమయిన అంతర్ముఖ స్థితిలో ఈ సృష్టి అంతా పవిత్రమయిన శ్వాస ద్వారా నేను సృజించినట్లుగా తెలుసుకున్నాను. ఎవరికి అర్ధమవుతుంది ఆత్మసాక్షాత్కారము పొందిన పవిత్రాత్ముని అనుభవం ఎలా ఉంటుందో? లోతులకు వెళ్ళేకొద్దీ, అంతర్ముఖ సమాధి స్థితిలో సృష్టి రహస్యాలు ఎన్నో బహిర్గతమవుతాయి. ఎవరికయితే భగవత్సంబంధం ఉంటుందో వారికి మాత్రమే ఈ రహస్యాలు అర్ధమవుతాయి. ప్రతి శ్వాస ఒక పునర్జన్మ. ప్రతి గుండె చప్పుడు ఒక నూతన సృష్టి. ఇది పవిత్రాత్మ పాడుతున్న గీతంలా అనిపించింది.

వర్షం నెమ్మదిగా తగ్గిపోయింది. సూర్యుడు మబ్బుల చాటు నుండి బయటపడి తన ప్రకాశాన్ని ప్రసరించసాగాడు. నేనింకా ఆ దివ్యానుభూతి నుండి బయటకి రాలేదు. సూర్య భగవానుడు తన లేత కిరణాలతో సమస్తాన్ని ప్రకాశింపచేస్తున్నాడు. ఆ లేలేత సూర్యకిరణాలలో స్నానమాడుతూ నేనింకా ఆ మధురానుభూతిలో తేలియాడసాగాను. గొప్పతనమంతా పరమాత్మునిదే. నేను అతి ప్రయత్నం మీద నా చేతులను చాచి భగవాన్ క్రీస్తును కీర్తించసాగాను. అంతా నాకే తెలియని అతీతస్థితిలో ఉన్నాను.

రోజంతా గడిచిపోయింది. సూర్యాస్తమయం అయింది. నెమ్మదిగా చీకట్లు ముసురుకుంటున్నాయి. ఉద్యానవనాన్ని కాపలాకాచే వాళ్ళు అందరినీ బయటికి పంపించి వేసి తలుపులు వేయడానికి సిద్ధపడుతున్నారు. అందువలన నేను మరొక్కసారి ఉద్యానవనం లోపలికి వెళ్ళి ఆ సుందర దృశాయలను తనివితీరా వీక్షించాను. అందమైన పూలను, చెట్లను ప్రేమతో ముద్దాడాను. లతలన పెనవేసుకున్నాను. ఎత్తైన వృక్షాలను చూస్తుండిపోయాను. అక్కడి గాజు తొట్టెలోని చేపలకు తలవంచి నమస్కరించాను. ఈ మూగ జీవాలు, వృక్షాలు మనుష్యుల హృదయాలతో ఏ విధంగా మాట్లాడుతాయి. వాటి భావాలను మానవులు ఎలా అర్థం చేసుకుంటారు. వాటికి కళ్లుంటాయి కాని చూడలేవు. చెవులుంటాయి కాని వినలేవు, ప్రకృతిని మానవుడు ప్రేమించి ఆరాధించినప్పుడే అతడు నిజంగా జీవించి ఉన్నట్లు, లేదా మరణించిన వాడితో సమానమే అవుతాడు.

అందువలన నేను ప్రకృతిలో లీనమయిపోయి దానితో తాదాత్మ్యం చెంది నా హృదయంలోకి భావాలను చెట్లతో, లతలతో, పుష్పాలతో పంచుకుంటున్నాను. అలాగే అవి ఆనందంగా తలలూపుతూ నాతో మాట్లాడుతున్నట్లే ఉంది. బయటికి వచ్చేముందు మళ్ళీ అదే బల్ల మీద కూర్చుని కాసేపు ఆ ఉద్యానవన సౌందర్యాన్ని తిలకించి ముగ్ధుడినయి పోయాను. ఎంతో పొడవయిన నీడ నిచ్చే ఆ వృక్షాలు నావి కావా? ఈ అందమయిన పుష్పాలు నా



ప్రేమకు ప్రతిరూపం కాదా? భూమి, ఆకాశం, నక్షత్రాలు ఇంకా ఇతరాలన్నీ నాకు మాత్రమే చెందుతాయి. అసలు నాది కానిది అంటూ ఏమీ లేదు. ఎవరికి ధైర్యం ఉంది ఈ నా ఆనందానికి అడ్డుపడడానికి? ఎవరయినా వీటినుండి నన్ను వేరు చేయగలరా? ఈ ప్రపంచమంతా నా సొంత కుటుంబమే. అందులో నివసించే వారందరూ నాకు సోదరసోదరీమణులు. వారిని ప్రేమించి, వారందరికి సేవ చేయటమే నా మతము.

ఇది ఎంతో గొప్ప ఆశీర్వాదము. నా ప్రతి శ్వాసలో నేను భగవంతుని ఉనికిని గుర్తించగలుగుతున్నాను. ప్రతి శ్వాస పునర్జన్మ. నా జేబులో ఒక ప్రియ సోదరి వ్రాసిన ఒక కవిత ఉందని గుర్తు వచ్చి, దానిని బయటికి తీసి చదవటం మొదలుపెట్టాను.

కవిత – 1

**నా మీద శ్వాస నిలుపు, అది భగవంతుని శ్వాస అవుతుంది**
**మా ఉనికిని మేము పూర్తిగా కోల్పోయి, భౌతికమయిన**
**ఆవరణలు నశించి ఈశ్వరుడి దివ్యజ్యోతిలో ప్రకాశించేదాకా**
**మా మీద శ్వాస నిలుపు, అది భగవంతుడి శ్వాస అవుతుంది.**
**మాలో నూతన జీవితాన్ని ప్రవేశపెట్టు**
**అప్పుడు మేము కూడా ఈశ్వరుడి వలే ప్రేమించగల్గుతాము**
**ఈశ్వరుడు చేసే పనులు చేయగల్గుతాము**
**మా మీద శ్వాస నిలుపు. అది భగవంతుని శ్వాస అవుతుంది**
**దానివలన మాకు మరణం అనేది ఉండదు**
**కాని ఈశ్వరుడితో కల్సి యదార్థమయిన జీవితాన్ని**
**గడుపుతూ అమరత్వాన్ని పొందుతాము.**

అది చదివిన తర్వాత నాకు ఎంతో ఆత్మానందం కలిగింది. నా ప్రతి శ్వాసలో దివ్యత్వం నిండిపోయింది. బాగా చీకటి పడిపోయింది. వర్షం బాగా కురవసాగింది. నాకు అక్కడి నుండి కదలాలి అనిపించడం లేదు. కాని తప్పక అక్కడి నుండి లేచి నెమ్మదిగా నడుచుకుంటూ ఇంటిదారి పట్టాను. దారిలో అందరిలో ఏకత్వాన్ని భావిస్తూ, అందరిలో నా ప్రియమయిన ముఖాలను దర్శిస్తూ ఇంటికి చేరుకున్నాను. తడిసిపోయిన బట్టలు మార్చుకొని, నా మంచంపై పడుకున్నాను. కాని ఇంకా నేను ఆనందమయ స్థితిలో ఉండిపోయి, మనస్సు నిండా కోటి సూర్యుల తేజస్సును దర్శిస్తూ నిద్రలోకి జారిపోయాను.

**అస్మాకమేవ శాస్త్రేషు భగవానభివర్ణితః ।**
**‘అభీ’రితి తతో స్మాభిః స్థాతవ్యం నిర్భయైస్సదా ॥**

మన శాస్త్రాలలో మాత్రమే భగవంతుడు ‘అభీః’ (భయరహితుడు) అని అభివర్ణించబడినాడు. అందువల్ల మనం సర్వదా నిర్భయులమై ఉండాలి.

– స్వామి వివేకానంద

# సూర్యస్తుతి

**మల్లాది శ్రీహరిశాస్త్రి**

ఈ 70 నామ మంత్రములను ఉచ్చరించుచూ, సూర్యభగవానుని చూచుచూ, మోకాళ్లపై నిలబడి, రెండు చేతులతో రాగిపాత్రను పట్టుకొని, ఆ పాత్రను నీటితో నింపి, గన్నేరు మున్నగు ఎర్రని పూలు, రక్తచందనము, దూర్వాంకురములు, అక్షతలు ఉంచి, ఆ పాత్రను నొసటికెదురుగా నుంచుకొని, సూర్యభగవానునకు అర్ఘ్యము నొసంగినవారు దరిద్రులు కారు. దుఃఖములను పొందరు. భయంకర వ్యాధుల నుండి విముక్తిని పొందెదరు. మరణానంతరము సూర్యలోకమున నివసింతురు.

1. ఓం హంసాయ నమః
2. ఓం భానవే నమః
3. ఓం సహస్రాంశవే నమః
4. ఓం తపనాయ నమః
5. ఓం తాపనాయ నమః
6. ఓం రవయే నమః
7. ఓం వికర్తనాయ నమః
8. ఓం వివస్వతే నమః
9. ఓం విశ్వకర్మణే నమః
10. ఓం విభావసవే నమః
11. ఓం విశ్వరూపాయ నమః
12. ఓం విశ్వకర్త్రే నమః
13. ఓం మార్తాండాయ నమః
14. ఓం మిహిరాయ నమః
15. ఓం అంశుమతే నమః
16. ఓం ఆదిత్యాయ నమః
17. ఓం ఉష్ణగవే నమః
18. ఓం సూర్యాయ నమః
19. ఓం అర్యమ్ణే నమః
20. ఓం బ్రధ్నాయ నమః
21. ఓం దివాకరాయ నమః
22. ఓం ద్వాదశాత్మనే నమః
23. ఓం సప్తహయాయ నమః
24. ఓం భాస్కరాయ నమః
25. ఓం అహస్కరాయ నమః
26. ఓం ఖగాయ నమః
27. ఓం సూరాయ నమః
28. ఓం ప్రభాకరాయ నమః
29. ఓం లోకచక్షుషే నమః
30. ఓం గ్రహేశ్వరాయ నమః
31. ఓం త్రిలోకేశాయ నమః
32. ఓం లోకసాక్షిణే నమః
33. ఓం తమోరయే నమః
34. ఓం శాశ్వతాయ నమః
35. ఓం శుచయే నమః
36. ఓం గభస్తిహస్తాయ నమః
37. ఓం తీవ్రాంశవే నమః
38. ఓం తరణయే నమః
39. ఓం సుమహసే నమః
40. ఓం అరణయే నమః
41. ఓం ద్యుమణయే నమః
42. ఓం హరిదశ్వాయ నమః
43. ఓం అర్కాయ నమః
44. ఓం భానుమతే నమః
45. ఓం భయనాశనాయ నమః
46. ఓం ఛందోశ్వాయ నమః
47. ఓం వేదవేద్యాయ నమః
48. ఓం భాస్వతే నమః
49. ఓం పూష్ణే నమః
50. ఓం వృషాకపయే నమః
51. ఓం ఏకచక్రరథాయ నమః
52. ఓం మిత్రాయ నమః
53. ఓం మందేహారయే నమః
54. ఓం తమిస్రఘ్నాయ నమః
55. ఓం దైత్యఘ్నాయ నమః
56. ఓం పాపహర్త్రే నమః
57. ఓం ధర్మాయ నమః
58. ఓం ధర్మప్రకాశనాయనమః
59. ఓం హేలికాయ నమః
60. ఓం చిత్రభానవే నమః
61. ఓం కలిఘ్నాయ నమః
62. ఓం తార్క్ష్యవాహనాయ నమః
63. ఓం దిక్పతయే నమః
64. ఓం పద్మినీనాథాయ నమః
65. ఓం కుశేశయ కరాయనమః
66. ఓం హరయే నమః
67. ఓం ఘర్మరశ్మయే నమః
68. ఓం దుర్నిరీక్ష్యాయ నమః
69. ఓం చండాశవే నమః
70. ఓం కశ్యపాత్మజాయ నమః

(కాశీఖండము అ.9 నుండి)



# ఆనందము

**స్వామి ఓంకార్**

## ఓంకారము నిత్యము

దుఃఖపూరితము, బాధానిత్యము అగు ఈ జగతిలో ఆనందమున కెచ్చటను తావులేదు. గృహములందేమి, సంఘములందేమి ఈ ప్రపంచమందెల్లెడల దుఃఖము, అశాంతి నిండియున్నవి.

గృహములయందు, కొన్నియెడల ఆశ్రమముల యందు కూడ ఆనందము లేకుండుట నేటి జగతిని సామాన్యమై యుండ, కొందరు యేదోవిధముగ ఆనందము పొందుట అదృష్టము. కొందరు అమాయకులను యేదోవిధముగ హింసించి కూడ ఆనందము పొందుచుందురు.

కొందరు స్నేహితులకైన నా జీవితము వుపయోగించిన నా జన్మ ధన్యమైనదని భావించుచుందును. నా గురించి చెండు మాటలాడుటలో యెవరైన ఆనందము పొందినను నాకు సంతోషమే. ఎవరైన నన్ను దూషించుటలో, విమర్శించుటలో, బాధించుటలో ఆనందము పొందుచుండిన అట్టివారికి సుస్వాగతము. ఈ జీవితము అందరిదీ అని భావించుటలోనే నాకు సంతోషము కలుగుచుండును.

ఓ దైవస్వరూపులారా! శాంతి కాముకులారా! నన్ను విడువలసినది లేదు. చాలాకాలము క్రిందటనే ఈ శరీరము గతించెను. ఈ క్రింది విధముగ చెప్పబడినట్లు, ‘స్వామి మరణించెను. ఓంకారము సజీవము.’

ఈ మృతదేహమును విందారగించుటకు రాబందులకు సుస్వాగతము. సామాన్యముగ రాబందులు మృతదేహములపై ననే విందు చేయుచుండును. కొందరు తమ మేధాశక్తిచే ఎంత ఉన్నతస్థితి కెగసినను, వారికన్నులు మాత్రము నిరంతరము అధోముఖమై క్షుద్ర విషయములపై కేంద్రీకృత మగుచుండును.

అట్టివారికి అధికమగు విజ్ఞానము, కరుణ దైవము అనుగ్రహించుగాక! వంచితులగువారి కష్టములలోను, పరీక్షలయందును కూడ ఎక్కువ సహనశక్తిని, ప్రేమను దైవము ప్రసాదించుగాక!

వంచించువారిని, వంచింపబడువారిని దైవము బ్రోచుగాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

సృష్టిలోని ప్రతి అణువునందు గల దైవత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఓంకార నాదము. అది సృష్టి నాదం.

**– శ్రీశ్రీ పరమహంస యోగానంద**

# దేవ్యుపాసనా ఫలము

**జగద్గురు పరమాచార్యులు**

## తృప్తి కలిగినవాడు నిత్య సంతోషి

సౌందర్యలహరిలో చిట్టచివర శ్లోకానికి ముందుటి శ్లోకంలో శాక్తోపాసకులు ఉపాసనా ఫలితముగా ఏయే ప్రయోజనాలు పొందుతారో ఆయా ప్రయోజనాలు శ్రీమత్ శంకర భగవత్పాదులు విశదీకరించారు.

శైశవంలో ఆకలి వేసినప్పుడూ దడ పుట్టినప్పుడూ మనం మన శరీర ధారణకు కారణమైన కన్నతల్లి ఒడిలో చేరి ఆక్రందనం చేసి పాలు క్రోలి పెరిగి పెద్దలమైనాము, బిడ్డ కొంచెం ఏడిస్తే చాలు. తల్లి తన పనులన్నీ ఒక పంకకు నెట్టి తన శిశువును గమనిస్తుంది. శిశువులు తల్లిని నోరార 'అమ్మా' అని పిలిచేటట్లు లేగదూడలు కూడా తమ తల్లులను అంబా అని సంభోదిస్తవి. 'మేస్తూ వున్న గడ్డి వదిలిపెట్టి దూడ దగ్గరకు వేగముతో పరిగెత్తే గోమాత హృదయానికే ఆ యేడ్పులోని కలత తెలుసు. అంబా రవము నుండియే అమ్మ అనే మాట పుట్టి వుండాలి. అంబా అని ఆక్రందించే లేగదూడల వలే మనం కూడా ఆ బ్రహ్మ కీటజననియైన అంబిక మ్రోల మొరపెట్టుకుంటే ఆలోకమాత అనుగ్రహానికి పాత్రులము కాగలమని గ్రంథాంతంలో ఆచార్యులవారు గ్రంథ ఫలశ్రుతిగా కాక అంబికాచరణ దాన ఫల శ్రుతిగానే చెప్పారు.

**సరస్వత్యా లక్ష్మ్యా విధి హరి సపత్నో విహరతే**
**రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషా,**
**చిరం జీవన్నేవ క్షపిత పశుపాశ వ్యతికరః**
**పరానందభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్.**

భక్తవత్సలవు నీవు. నీ భక్తులు నిన్ను ఏంకోరినా యిస్తావు. నీవో, లక్ష్మి ఒక చేత్తోనూ వాణి ఒక చేత్తోనూ వింజామరలు వీస్తుండగా కొలువు తీరుస్తావు. లక్ష్మిసరస్వతులు నీకు దాసికలై వింజామరలతో సేవ చేస్తుండగా నీ కతివత్సలుడైన నీ భక్తునికి సైతం వారు సేవ చేయరా ఏమి! పరిపూర్ణతకు లక్ష్మి కటాక్షం తప్పనిసరి. ఆ లక్ష్మి పురుషోత్తమునిధామం వైకుంఠం వదలి నీ పాదాల ముందే పడిగాపులు కాస్తూంది. అంతటితో ఆగక నీ భక్తునికి సైతం పరిచర్య చేయడానికి సమకట్టుతూంది. అపుడు నీ భక్తుణ్ణి చూస్తే పురుషోత్తమునికి అసూయ కలుగుతుంది.

ఎవరైనా సరే లక్ష్మి కటాక్షాన్నే మొదట కోర్తారు. తన బిడ్డ తెలివితక్కువతనం తల్లికి తెలుసు గనుక లక్ష్మి కటాక్షాన్నే మొట్టమొదట అనుగ్రహిస్తే అజ్ఞానవ శాన ధనం దుర్వ్యయం చేసేసి పాపాలు మూటకట్టుకుంటాడని అతనికి మొదట సరస్వతీ ప్రసన్నత అనుగ్రహించి, తరువాత ఐశ్వర్యాన్ని చక్కగా అనుభవించే వివేకం ఇస్తుంది శ్రీమాత.

'స మేంద్రో మేధయా స్పృణోతు తతో మేశ్రియ మావహ' అని తైతిరీయం మొదట మేధ తరువాత శ్రీ ప్రసాదం. దీనికి ఆచార్యులవారు భాష్యం। వాస్తూ "ఏవమదీని కుర్వాణా శ్రీ ర్యా తాం తతో మేధా సాహిశ్రీ రనర్థాయైవేతి" మేధలేనివానికి డబ్బిస్తే అనర్థమే కలుగుతుందట. డబ్బెందుకు! పుణ్యము సంపాదించటానికి. బుద్ధి లేని వానికి డబ్బిస్తే వాడు పాపాల భైరవుడవుతాడు. అట్టిచోట అర్థానికి అర్థం అనర్థమే – "అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతఃసుఖలేశ స్సత్యమ్" అని భజగోవిందంలో భగవత్పాదులే బోధించారు.

సర్వోత్పాదకశక్తి పరాశక్తి, ఆమె కటాక్షమాత్రం చేత భక్తునికి ఎక్కడలేని తెలివీ పుట్టుకొని వస్తుంది. అతని మనస్సనే ఆకాశంలో మెరుపుతీగవలె అపూర్వములైన సత్యాలు హఠాత్తుగా మెరుస్తాయి. మంచిపనులు చేయడం అతనికి అలవాటవుతుంది. అతడెప్పుడూ ఇహానికి, పరానికీ ఉపయోగించే కార్యాలనే ఎల్లప్పుడూ చేస్తుంటాడు. జగన్మాత యెడల ఏకాంతభక్తి నెరపినవాని నాలుక మీద పలుకుల వెలది కాలి గజ్జల మోతాలు వినిపిస్తయ్. అట్టిభక్తుని యెడల సరస్వతికి గల మక్కువను చూచి బ్రహ్మగారికే కలవరం పుడుతుందిట.

ఐశ్వర్యానికి ఏమిటి ప్రయోజనం! అది మొదట తన అనుభవానికి రావాలి. పరహితం కోసం చేసే దానధర్మాలకు కూడి రావాలి. పాపికి ఐశ్వర్యం పడితే అది అతనికి కోపమోహ కారణమవడమే గాక లోకానికి కష్టకారణం కూడా అవుతుంది.

డబ్బు మాట యెత్తితే అందరికీ కొరతే, అందరికీ ధనవాంఛే. ఒకనికెంత ధనమున్నా బ్యాంకిలో ఎంత నిలువచేసినా అతన్ని అడిగిచూడండి. మీరేమిటో అనుకుంటున్నారు! నాదంతా పై వేషమే. నాచేతిలో నయాపైసా లేదు అని చెపుతాడు. 'ఫలానా ఆయన డబ్బు కలవాడు' అని ఎవరైనా చెపితే ఆ ఆసామికి ఆ చెప్పినవాడి మీద ఎక్కడ లేని కోపం వస్తుంది. తమకు ఎంత ధనమున్నా అది అల్పమనే అందరీ భావన. మరింత సిరిపట్టకూడదా అని ఆగర్భ శ్రీమంతులు కూడా ఎదురుచూస్తుంటారు. ఇది లోకం తీరు. అందుచేతనే భక్తుని చూచి 'నీకు డబ్బు కావాలా నాయనా! కావలిస్తే మొదట మేథావంతుడవు, వివేకివి కా, అప్పుడు కాని నీకిచ్చే అర్థం సార్థకం కాదు' అని అమ్మ బుద్ధి చెపుతుంది.

నిజానికి దారిద్ర్యం అంటే ఏమిటి? నేను దరిద్రుడను అని చెప్పుకోవడమే. తృప్తి కలవాడు నిత్యసంతోషి. 'నేను దరిద్రుణ్ణి' 'నేను దరిద్రుణ్ణి' అని సొద వెళ్ళబోసుకుంటే ఒక్క నయాపైసా యిచ్చే పుణ్యాత్ముణ్ణి చూపండి, 'అంతో ఇంతో దేవుడిచ్చాడు' అని తలపోస్తే సంతోషంగానైనా బ్రతకవచ్చు.

సరి, వేదశాస్త్ర విజ్ఞానం, వివిధ భాషా కోవిదత్వం ఐశ్వర్యం వివేకం అన్నీ ఉన్నవి. అయినా ఏదో కొరత వున్నది. అదేమి?

విద్యాధనాలుంటే చాలదు. అందచందాల మీద ఇచ్ఛ పరుగులెత్తుతుంది. చూచేవాళ్ళకు కొట్టవచ్చినట్లుండే తేజస్సు కావాలని కోరిక పూరుతుంది. అంబికానుగ్రహం వున్న ఉపాసకునకు అదిన్నీ చేకూరుతుంది. అందంలో అవధి పొందినవాడు అంగలేనివాడు. 'కోటి మన్మథ విగ్రహమ్' అని ఈశ్వరాదుల వర్ణనం అనంగుని మించిన అందగాడు మరొకడు లేడు అతని శ్రీమతి రతి

మహా సౌందర్యవతి. మగనికి తగిన మగువ. ఓ అమ్మా! నిన్ను ధ్యానించేవాడు రతీదేవి పాత్రివ్రత్యానికి శైథిల్యం కలుగజేసే అందచందాలతో అలరారుతాడట.

చదువూ డబ్బూ అందమూ ఇవి అన్నీ వున్నా ఆయుర్దాయం లేకపోతే నిష్ప్రయోజనం. అంబికా కటాక్ష మున్న సాధకుడు దీర్ఘాయుష్మంతుడైతాడట.

మంచిది. అన్నీ అమరినవి. తతఃకిమ్ – తరువాత? ఈ అనుభవానికి పిదప ఈ ప్రశ్న వైరాగ్యానికి బీజం. మనకు వైరాగ్యం గనుక సొంతంగానే కలిగితే అది క్షణకాలం ఉంటుందో, ఉండదో, అమ్మదయచే కలిగితే ఆ వైరాగ్యం మేకు పాతినట్లే.

అక్కరలేని విషయాల మీద ప్రేమ మనలను బాధిస్తుంది. బంధిస్తుంది. ఈ పాశాలు వున్నంతవరకూ మనం పశువులం, భగవానుడు పశుపతి, డబ్బు, మనస్సు, అందము, ఆయుస్సు అనే పాశాలతో ఆయన మనలను బంధించి వున్నాడు. ఎన్నడు నిర్వేదపూర్వకమైన వైరాగ్యం కలుగుతుందో ఆనాడు మనపాశాలు జారి పశుత్వం పోయి పరబ్రమ్మలమై కూర్చుంటాము. శుద్ధప్రకాశచేత నవస్తువే ఆత్మ. మనము పాశవిముక్తులమైతే పరమానందం మన సొమ్ము. అంబిక మనకిచ్చే అంతిమఫలం అదే.

పురుషార్థాలను ప్రసాదించేది పరమేశ్వరి. గోమాత కడకు వెళ్ళే లేగలవలె శ్రీమాత చరణారవిందములను చేరితే గాని ఐహికవిషయానుభవము పిదప మను ఆముష్మికమగు కైవల్యానందం దొరకదు.

(తెనాలి సాధనా గ్రంథమడలివారి సౌజన్యముచే ప్రచురింపబడినది)

**శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి**

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ./డి.డి. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
ఎమ్.ఓ. ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను.
మీ అడ్రసు మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)**
**వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా.**



# ధన పిపాస

**మూలము : స్వామిని శారద ప్రియానంద** **అనువాదము : డా॥ గరిగిపాటి కన్యాకుమారి**

**ధనార్జనే ధ్యేయం కాకుండా మానవత్వపు విలువలు పెంచుకుంటే మనిషి మనిషి అవుతాడు**

ఈ జగత్తంతా ధనము చుట్టూ పరిభ్రమిస్తోందనేది 'ధనమూలం ఇదం జగత్' అను సంస్కృత భాషలోని నానుడికి అర్థంగా చెప్పవచ్చు. ఆధునిక కాలంలో ఈ వాక్యము ఎంతయో సత్యమనిపిస్తుంది. మనిషి ధనమునకు యిస్తున్న ప్రాధాన్యత యెంతగా పెరిగిందంటే – ఇతరములైనవి అనగా శీలము, ఋజువర్తనము, విలువలు, నైతికత, సత్ప్రవర్తన మరియు సద్బుద్ధి అనునవి దానిముందు నిరర్థకమైనవిగా భావించబడుతున్నాయి. ధనవంతునికి అన్ని రంగములలోనూ విశిష్టమైన గౌరవము మరియు ప్రథమ స్థానము యివ్వబడుతుంది. అతని దుర్గుణములు, దుష్కృత్యములు మరియు అనాగరికమైన నడవడి ధనము అనే ముసుగులో కప్పబడి, అతనిని ప్రశ్నించే సాహసం చెయ్యడానికి సమాజం జంకుతూ ఉంది. ఈ పతనము యింతటితో ఆగలేదు. కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం సమాజంలో మనం ఎదుర్కొంటున్న న్యూనతా భావము మరియు దుర్మార్గము దీని పర్యవసానమే. వివేకవంతులైనవారు మాత్రమే దేశము ఎంతటి పతనావస్థలో ఉన్నదో గ్రహించగలరు. దీర్ఘాలోచన చేయని డాంబికులు ఈ వ్యవస్థను ఇంకా నిర్వీర్యం చేస్తున్నారు. ప్రస్తుత సమాజ స్థితి పట్ల ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రతివారూ ఫిర్యాదు చేసేవారే. దీనికి విరుగుడు యెక్కడ ఉంది? మనిషి మనసును ధనము ఎంతగా ప్రభావితం చేసిందన్న విషయంపై విచారిస్తేనే మనము ఈ స్వయం కృత నరక కూపము నుండి బయట పడతాము. మనిషి జీవితంలో ఈ ధనానికి యింత ప్రాధాన్యత ఎలా కలిగింది?

ధనము అంటే బంగారమైనా, వెండి అయినా, రాగి అయినా లేక నాణెములైనా లేక అధికారికంగా ముద్రించబడి కరెన్సీ నోట్లైనా ఏవైనా కావచ్చు. డబ్బు యథాతథంగా తినడానికి, త్రాగడానికి లేక ఆస్వాదించడానికి పనికిరాదు. తనంత తానుగా అది ఇంద్రియ సుఖములను యివ్వజాలదు. అందుచే ధనముపైగల మక్కువకు కారణము వేరే యున్నది. ఆ ధనమునకు గల విలువ వల్ల మనము సుఖములను పొందటానికి కావలసిన వస్తువులను పొందగలుగుతాము. దానికి గల మారకపు విలువ తప్ప ధనము తనంత తానుగా వ్యర్థమైనదే కాక దానిని భద్రపరచడమనే అదనపు భాధ్యత మనమీద పడుతుంది.

దీనిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే, మనము ఎంత మూర్ఖులమో తెలుసుకొనవచ్చు. ధనము పట్ల గ్రుడ్డి వ్యామోహముచే, మనిషి రోజులు, నెలలు, సంవత్సరాలు దానిని

సంపాదించడానికిననన తన శక్తి, యుక్తులన్నీ దారపోస్తాడు. సంపాదించినది అనుభవించడానికి కూడ ఆశపడడు. ధనర్జానకై శ్రమించి అనారోగ్యము పాలవడమే కాక మరణశయ్య మీద ఉండి కూడా మనిషి మరికొంత ధనం సంపాదించడానికి ఆరాటపడ్తాడు. అది భావ్యమా? మనిషి యౌవ్వనము, ఆరోగ్యము మరియు ప్రాణము కంటే ధనము ఏ విధంగా గొప్పది? మనము ఇంత అంధకారములో ఎందుకు వున్నాము?

ధనము మనకు ఏమి యివ్వగలదో అనే దానితో గుర్తించి ఒక గందరగోళ స్థితిలో మనము కన్నులుండి కూడా అంధులవలె ధనము వెంబడి పరుగిడుచున్నాము. ధనము వస్తువులను అనుభవించడానికి ఒక సాధనము మాత్రమే. అందుచే మనిషి ధనమును సుఖములతో సమన్వయపరచుకొని దానికై పరుగెడతాడు. మందబుద్ధి చేత కార్య, కారణములను సరిగా బేరీజు వేసుకొనలేక పోవడము అవగాహనా లోపంగా చెప్పవచ్చు. మనము నిస్పాక్షికమైన భావనతో ఈ విషయమును అవగాహన చేసుకొనగలిగితే, మనకు ధనము ఎంత పనికిరానిదో, దానివల్ల లాభము లేకపోగా మనము దాని ఉచ్చులో ఎలా పడతామో అర్థమవుతుంది.

మనిషి పతనం చెందుతున్నప్పుడు కొంతసేపు ఆగి ధన సంపాదనకై తాను ఎన్ని అసత్యాలు పలికాడో, ఎన్ని అన్యాయాలను చేసాడో, ఎంత మానవ మేధను, శక్తిని దుర్వినియోగపరచాడో అర్థము చేసుకుంటే, సత్యమును గ్రహించి మనిషిగా మారగలుగుతాడు. అతడు తిరిగి మానవత్వము, సహానుభూతి, సేవ, సహాయము చేసే గుణములతో నిండియుండి ఈ సమాజమునకు ఎంతో తోడ్పడుతాడు. మాయ అనే అడ్డుతెర నుండి విడివడి స్వచ్ఛమైన మనిషిగా మిగులుతాడు.

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది FCRA (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంటుకు తమయొక్క నివసించే ప్రాంతములోని తమ Bank Account నుండి ఆ దేశ కరెన్సీలో పంపగలరు. పంపిన విధవ వివరములు srisanthiashram@gmail.com అనే E-mail ID కి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : AXIS BANK, బ్రాంచి : Kakinada, Karanamgari Jn., E.G.Dt., A.P. India.

Account Name : THE MISSION OF PEACE

FCRA Savings Bank Account No. : 918010005985581

IFSC Code : UTIB0002700 / SWIFT Code : AXISINBB076



# కొబ్బరికాయ కథ

**మూలము : స్వామి ఓంకార్** **అనువాదము : గరిగిపాటి కృష్ణ**

**భగవంతుని అన్నింటా దర్శించుము. చేయాలనుకున్న మంచి పనిని వెంటనే చేయుము.**

ఉష్ణమండల ప్రాంతాలలో సాధారణంగా కోతులు కొబ్బరి చెట్లెక్కి కొబ్బరికాయలు తెంపడం చూస్తూంటాము. కానీ ఆ తెంపిన కాయలను అవి ఆస్వాదించలేవు. ఎందుకనగా వాటి పీచు బాగా దళసరిగా ఉండడమే కాక దాని పెంకు కూడా చాలా గట్టిగా ఉండటం చేత అవి కొబ్బరికాయ పగలకొట్టలేవు. కోతులు కొబ్బరికాయలను చెట్టు నుండి తెంపితే ఇతరులు వాటిని ఆస్వాదిస్తారు. అయితే ఈ ఉదాహరణతో నాకు ఎట్టి ప్రత్యక్ష సంబంధము లేకపోయినా, నాకు ఈ విషయము కొంతమంది గ్రంథకర్తలు వ్రాసే పుస్తకాలు పుంఖానుపుంఖలుగా అచ్చు వేయించడంలో నిమగ్నులుగా ఉంటూ ఉండడము, వాటిలో మతపరమైన మరియు ధార్మికమైన సూత్రములను క్రోడీకరించి ప్రకటించడానికి సామ్యము కనపడుతుంది. వారు చేసే పనిని కోతులు ఎంతో కష్టపడి కొబ్బరికాయలు తెంపడముతో పోల్చవచ్చును. వాటి సారము మాత్రము సత్యశోధకులకు చెందుతుంది. ఈ ప్రపంచమంతా కొబ్బరికాయలను చెట్టు నుండి తెంపేవారితో నిండి ఉండక, వాటి సారమైన కొబ్బరినీరు – అమృతత్వము అనే పానీయమును గ్రోలేవారిగా వుంటే ఎంత బాగుంటుంది?

వాళ్ళను పరిగణనలోనికి తీసుకుంటే, మనకు ఎండుకొబ్బరి, పచ్చికొబ్బరి యొక్క విభిన్న స్థితులు గోచరిస్తాయి. మీది పచ్చి కొబ్బరి స్థితా? లేక ఎండుకొబ్బరి దశకు చేరుకున్నారా? బహుశః మీరు నా అసంబద్ధకమైన ప్రశ్నకు ఆశ్చర్యపడవచ్చు. అయితే మీ ప్రస్తుత స్థితి ఎండు కొబ్బరిలాగా వుంటే మీరు పరిపక్వతకు చేరుకున్నట్లే మీరు శరీరము ధరించి జీవన్ముక్తులు. మీరు ఈ శరీరమునకు, మనస్సుకు, ప్రపంచమునకు అతీతమైన స్థితిలో వున్నట్లే. జీవన్ముక్తులైన మీరు ఈ జీవితములోనే సంపూర్ణ స్వేచ్ఛాగతులు. ఎండుకొబ్బరి దాని పెంకు నుండి విడివడినట్లు, మీరు ఆత్మ స్వరూపమే కాని ఈ శరీరము కాదని అనుభవముతో గ్రహించిన వారివలె వుందురు.

అట్లుగాక మీరంతా పచ్చికొబ్బరి దశలోనే యున్నట్లయితే నాకు దుఃఖము కలుగును. ఎందువలనంటే మీరింకా అపరిపక్వస్థితిలోనే యుండి మీరే ఈ మాంసము, రక్తము నిండిన శరీరమనే భ్రమలో జీవిస్తున్నారు. నిజానికి మీరు జీవన్మృతులు – జీవించివున్నా మీరు ఇప్పటికే చనిపోయినారు. ఇది ఎలాగంటే ఒక్కవేటుతో పచ్చికొబ్బరిని, దాని పెంకును ఎలాగయితే పగులగొడతామో, అలాగే ఏ మాత్రము పొగిడినా లేక తెగిడినా మీరు అస్థిరతకు గురి అవుతున్నారు. నా ప్రార్థన ఏమిటంటే మీరు కూడా ఎండుకొబ్బరిలా తయారయేందుకు ఉపక్రమించి నేను శరీరమనే భ్రమనుంచి ముక్తులుకండి.

ప్రకృతి సహజంగా, అతి సాధారణంగా జీవిస్తూ, జీవితంలో కృత్రిమత్వానికి, సంక్లిష్టతలకు లోను కాకుండా వుండే మహాత్ములకు నేను శిరసువంచి నమస్కరిస్తాను. ఎందుకంటే

వారు నిరాడంబరమైన, ప్రకృతి సహజమైన జీవనం సాగిస్తూ ప్రకృతిలో దొరికే ఫలాలను, గింజలను తమ ఆహారంగా యెంచుకుంటారు.

మళ్ళీ మనం కొబ్బరికాయ కథలోకి వద్దాం. మండు వేసవిలో ఒకనాడు సుబ్బిచెట్టి అనే వ్యాపారి తన కొబ్బరికాయలను ఒక గాడిద మీద వేసుకుని బజారుకు వెళ్తూ వుంటాడు. అతనితో పాటుగా బాలుడైన అతని కుమారుడు కూడ సంతకు వెళ్తున్నాడు. సుబ్బిచెట్టి సంతకు వెళ్లి తనదగ్గర వున్న కొబ్బరికాయలను అమ్మి బాగా డబ్బు సంపాదించాలకున్నాడు. సంతకు దూరం యెక్కువగా వుండటం చేత చిన్నవాడైన సుబ్బిచెట్టి కుమారుడు కొంతదూరము వెళ్లిన పిదప అలసటచే అతనికి దాహం వేసింది. తనతండ్రి పిసినారితనం తెలియడం చేత, అతను తండ్రిని ఒక కొబ్బరికాయను కొట్టి దన దాహం తీర్చమని అడగలేకపోయాడు. మరికొంత దూరం వెళ్లేసరికి ఆ బాలుడు ముందుకు నడవలేకపోయాడు. అప్పుడతడు సందేహిస్తూనే “నేను దాహంతో చనిపోయేలాగున్నాను. ఒక కొబ్బరికాయను నాకిచ్చి సందేహము తీర్చమని “అడిగాడు. అప్పుడా తండ్రి ఆశ్చర్యంగా కుమారుని చూస్తూ” ఏమిటి! కుమారా, కొబ్బరినీళ్లు ధనవంతులు మాత్రమే తాగాలి. నీకు అటువంటి ఆలోచన ఎలా వచ్చింది? ఇంకొన్ని గజాలు వెళితే ఒక సత్రం వస్తుంది. ఆ సత్రంలో వాళ్లు నీకు ఉచితంగా చల్లటి మంచినీళ్లు, మజ్జిగ ఇస్తారు. అవి ఈ గోరువెచ్చని కొబ్బరినీళ్లకన్నా యెంతో శ్రేష్ఠమయినవి. అక్కడ నీ దాహం తీరేలా మంచినీళ్లు, మజ్జిగ త్రాగవచ్చు. ఆ పిల్లవాడు ఏమి చేయగలడు? పాపం పసివాడు! అతను తండ్రి మాటననుసరించి నిదానముగా అడుగులు వేయసాగాడు. హత విధీ! అతడు అలసట, దప్పికలను తట్టుకోలేక హృదయస్పందనలు వేగమవడముతో క్రింద కూలబడ్డాడు. అటు పిమ్మట కొద్ది క్షణాలలోనే అతని ప్రాణము అనంతవాయువులతో కలిసిపోయింది.

ఇప్పుడు మనము కథ ముఖ్యభాగములోనికి అడుగు పెడతాము. పిసినారి తండ్రి సుబ్బిచెట్టిని నిస్పృహ, శోకము ముప్పిరిగొనగా ఈ విధంగా దుఃఖించాడు--- “ఓ నా కుమారా! నీవు నన్నప్పుడే విడిచిపెట్టి పోవాలా? నిన్ను బ్రతిమిలాడుతున్నాను, ఒకటేమిటి నా దగ్గర వున్న కొబ్బరికాయలన్నీ తీసికో. సజీవుడవై ఈ కొబ్బరికాయలన్నింటిలోని నీరు త్రాగు.

కానీ అప్పటికే ఆలస్యమయినది. ప్రపంచములో వున్న కొబ్బరికాయలన్నీ తెచ్చినా ఆ బాలుని సజీవునిగా చేయలేవు. మన జీవితములను బేరీజు వేసుకుంటే, మన ఆత్మీయులతో కొన్ని సందర్భాలలో సుబ్బిచెట్టి లాగానే పిసినారితనము ప్రదర్శించి వుండవచ్చు. ప్రత్యేకముగా మన ఆశ్రమము కూడా అనేక రకములయిన సుబ్బిచెట్టిలను కలిగివుంది. అలాగే ప్రాక్పశ్చిమములలో కూడా సుబ్బిచెట్టిలను కొదువలేదు. కొన్నిసార్లు మన ఆశ్రమములో తినడానికి ఏమీ వుండక తరువాతి భోజనము ఎక్కడినుంచి వస్తుందనే ఆలోచన కలుగుతుంది. మన మూగ జీవములయిన గోవులకు ఆహారము కానీ, గడ్డి కానీ వుండదు. మన పత్రికలు తగినంత స్టాంపులు లేక చందాదారులకు పంపించడము జరుగదు. ఈ విపత్కర సమయములో మనము సుబ్బిచెట్టి వంటి వారిని ఆశ్రయిస్తే మనకు లభించేవి శుష్క వాగ్దానములు మాత్రమే -- కొబ్బరికాయలను ఇంకను వదలిపెట్టరు. ఆ విధముగా మన లక్ష్యమైన విశ్వశాంతి ఉద్యమము నిశ్శబ్దముగా, నిదానముగా పోరాటము చేస్తూనే వుంది.



వ్యక్తిగతమైన ఆశ్రమ స్థితిగతులను పక్కన పెడితే నేను మీకివ్వగలిగిన సందేశము : మీరు ఏదైనా మంచి చేయదలచినచో దానిని వెంటనే అమలు చేయండి. అనిశ్చిత భవిష్యత్తుకై వాయిదా వేయకండి. ఇప్పుడే చేయండి, ఎందుకంటే ఈ క్షణమే మీది. ఆహా! క్షణభంగురమయిన జీవితమునకు -- మనము ఏ క్షణమయినా వీడ్కోలు పలుకవచ్చు. ఈ ప్రపంచములో మనము కూడబెట్టిన కొబ్బరికాయలు (అనగా నామరూపాత్మకమైన ప్రపంచమునకు) ఎందుకూ కొరగాకుండా నిష్ప్రయోజనమవుతాయి. అందుచే ఆలసించక మేల్కొనండి. ఇక్కడ ఈ మధ్య నాకు జరిగిన రెండు వ్యక్తిగత అనుభవాలను ప్రస్తావించకపోతే, నా సందేశము అసంపూర్తిగా మిగిలిపోతుంది.

నేను గతములో ఒకసారి ఒక చిన్న అనాథ పిల్లవానికి కొంత ధన సహాయము చేసాను. కానీ ఆ ధనము అతని అవసరానికి సరిపడేలా లేదు. కానీ యివ్వడానికి నా దగ్గర అంత ధనమేమీ లేదు కానీ రెండు కొత్త ఖద్దరు చొక్కాలు, తువ్వాళ్ళు మాత్రము వున్నాయి. అతను వెళ్ళిన తరువాత నేను వాటిని గురించి ఆలోచించినా నేను అప్పటికే బాగా అలసి వున్నందున నా ప్రక్క మీదనించి లేవలేకపోయాను. అప్పుడు నేను కూడా యితరుల మాదిరిగానే “నేను వాటిని తరువాత పంపవచ్చు” అని సమాధాన పడ్డాను. కొంతసేపయిన తరువాత ఆ పిల్లవాడు మరణించాడనే వార్త నాకు తెలిసింది. అతడు నా తువ్వాలు తీసుకోడానికి జీవించి లేడు. మీరు అప్పటి నా మానసిక వేదనను వూహించుకోండి... ఓమ్ శాంతి ఓమ్!

నేను నా ప్రార్థన ముగించి వేగముగా నాకు వచ్చిన లేఖలను చూడాలని వెళుతుండగా ఒక వీధి కుక్క బావి పక్కనే నేలపై పడి వుండడము గమనించాను. నేను దాని పరిస్థితి బాగులేదని గ్రహించి, తోటమాలిని పిలిచి తన గుడిసెకు ఆ కుక్కను తీసికొని వెళ్ళి దానికేదైనా ఆహారమును యివ్వవలసిందిగా చెప్పాను. మరుసటి రోజు నేను వాకబు చేయగా పనివాడు ఆ కుక్కను తన గుడిసెవద్దకు తీసుకొనివెళ్ళిన వెంటనే చనిపోయినదని తెలిసినది. ఈ సంఘటన నన్నెంతో కలిచివేసింది. అది ప్రాణముతో వుండగా నేను దాని చివరి క్షణములలో కొంతైనా దానికి సేవ చేసి ఒక విధమైన తృప్తితో జీవితము చాలించడానికి దోహదమవలేదనే వేదన నన్ను విచలితుని చేసింది. దానివల్ల ఏమి ప్రయోజనము కలుగుతుంది! ఇప్పుడు నేను చేయగలిగినదల్లా అంతర్ముఖుడనై నా వేదనను ఈశ్వరునికి నివేదించడమే.

ఓ దేవా! నీవు నా వద్దకు ఒక అనాథ బాలుని రూపములో వచ్చావు. కానీ నేను నిన్ను ఆరాధించలేదు. మరల నీవు వదలి వేయబడి, తీవ్ర అనారోగ్యముతో బాధపడే కుక్క రూపములో దర్శనమిచ్చినా నేను నా విధి నిర్వహణలో విఫలమయ్యాను. నన్ను మన్నించి, నాపై నీ కరుణ ప్రసరింపచేయి. భగవాన్! నేను ఇకముందు నిన్ను ఏ రూపములో దర్శించినా తత్క్షణమే నా సేవలందించడానికి అప్రమత్తుడనయేలా నన్ను దీవించు.

ఓం ఓం ఓం

# శ్రీ తులసీసర్వస్వము

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శర్మ

## 1. తులసీ పరిచయము

### ఆది వ్యాధి హర

జీవుడు కర్మచేతను, సంసారముచేతను నిత్యబద్ధుడై యుండును. ఆ బద్ధ స్థితియే అతని జీవితమును దుఃఖమయ మొనర్చును. ఆ దుఃఖ స్థితి నుండి ముక్త స్థితిని చేరుకొనుటకు జీవుడెన్నియో ప్రయత్నములను చేయుచుండును. ఆ సాధనల లక్ష్యము భగవదనుగ్రహము ద్వారమున ఆఖండానందము నందుటయే. అట్టి ఆనందప్రదమైన సాధనములలో యజ్ఞ యాగాదులు, ఉపాసనా పద్ధతులు, జ్ఞానార్జనము మున్నగునవి ప్రముఖములైనవి. ఈ సాధనము లన్నింటిలోను 1. నామసంకీర్తనము, 2. ఉపాసన అను భక్త్యంగములు సులభసాధ్యములైనవి. నామ సంకీర్తనమునకు గాని, ఉపాసనకు గాని ఆధారము దైవమూర్తి. అందరికిని అందుబాటులో ఉండి, ప్రత్యక్షముగానుండి, సర్వారిష్టములను అణగించి, సకలార్థములను కరతలామలకముగా నొనర్చునట్టి దైవమూర్తి శ్రీ తులసీదేవి.

తులసి మొక్క లేని, దానిని పూజింపని, సాంప్రదాయకమైన గృహ ముండదన్నచో అతిశయోక్తి కాదు. దైవముగా, అరిష్టవినాశినిగా, అభివృద్ధి ప్రదాయినిగా, ఔషధముగా, పవిత్రకారిణిగా, భగవత్ప్రీతిపాత్రురాలిగా అందరికి అందుబాటులో ఉండి, ప్రత్యక్ష దైవమైనది శ్రీ తులసీదేవి. పాంచరాత్రాగమమును, సర్వపురాణములును తులసీమాహాత్మ్యమును గూర్చి ప్రస్తావించినవి.

ఈ దేవిని గూర్చి ఇక విపులముగా తెలిసికొందము.

మానవులకు భగవంతుడైన శ్రీ మహావిష్ణువు ఎంతటి ఆరాధ్యుడో తులసి కూడ అంతటి ఆరాధ్యదేవత అయినది. ఈ తులసి చిరకాలమునుండి విష్ణువునకు నిత్యసహచరి అయినది.

తులసిని దేవతగా ప్రార్థించి, పూజించుట మనకందరకు తెలిసిన విషయమే కదా! తులసికి "విష్ణుప్రియ" అని పేరు ఉన్నది. క్షీరసముద్రమథన వేళలో శ్రీ కృష్ణునియొక్క ఆనందము నుండి ఈ తులసి పుట్టినదని పద్మపురాణములోని సృష్టి ఖండమునందలి "శ్రీ తులసీస్తవము" ప్రస్తావించినది.

**శ్లో॥ "కృష్ణానందాత్ సముద్భూతా, క్షీరోదమథనోద్యమే**
**ఉత్తమాంగే పురా యేన తులసీ విష్ణునా ధృతా ॥"**

విష్ణువు ఈ తులసిని తన తలపై ఆనందముతో ధరించినట్లు ఈ శ్లోకము పేర్కొనుచున్నది.



విష్ణుసంబంధమువలనను, విష్ణువు తలపై ధరించుటవలనను ఈ తులసికి పవిత్రీకరణశక్తి సిద్ధించినది. రోగములను తొలగించుట వలన దీనికి అమృతత్వశక్తి కూడ కలదని తెలియుచున్నది. అందువలననే మరణసమయము నందుగాని, మరణించిన తరువాత గాని, ఆ జీవుని నోటిలో తులసి తీర్థమును పోయు ఆచారము ఏర్పడినట్లు ఊహింపవచ్చును. నిత్యకృత్యములో ప్రతి ఆస్తికుని ఇంటియందును తులసిని పెంచుట, దానికి నీరు పోయుట, పూజించుట, తులసీదళములతో భగవంతుని అర్చించుట, తులసీదళములను వేసి పదార్థములను పవిత్రీకరించి, భగవంతునకు నైవేద్యము పెట్టుట మొదలగు పనులు మనకు పరిపాటియైనవి. ఈ విధముగా మానవుని నిత్యజీవితములో తులసి పెనవేసికొని పోయినది. తులసికి గల వివిధ నామములను పరిశీలింతము.

## 2. తులసికి గల వివిధ నామములు

**శ్లో॥ బృందాయై తులసీదేవ్యై ప్రియాయై కేశవస్య చ।**
**విష్ణుభక్తిప్రదే దేవి! సత్యవత్యై నమో నమః॥**

**శ్లో॥ మహాప్రసాదజననీ సర్వసౌభాగ్యవర్ధినీ।**
**ఆధివ్యాధిహరా, నిత్యం తులసి! త్వం, నమో స్తుతే॥**

**తాత్పర్యము :** దేవతలందరకు వారి వారి గుణములను, ప్రభావములను బట్టి వివిధ నామములు ఏర్పడుచుండును. అట్లే తులసీదేవికి కూడ గుణసంబంధములైన నామములు అనేకములు ఏర్పడినవి. "తులసి పూజయను శీర్షికయందు ఈమెకు గల అష్టోత్తరశతనామములు తెలుపబడినవి. ప్రస్తుతము శ్రీ తులసికి గల కొన్ని నామములను పరిశీలింతము. అవి. 1. బృందాదేవి. 2. తులసీదేవి. 3. కేశవప్రియ. 4. విష్ణుభక్తిప్రద. 5. సత్యవతి. 6. మహాప్రసాదజనని. 7. సౌభాగ్యవర్ధిని. 8. ఆధివ్యాధిహర. 9. విష్ణుప్రియ అను నామములు పై రెండు శ్లోకములలో చెప్పబడినవి.

అట్టి తులసికి నా ప్రణామములు. ఆమెవలన సర్వరోగములు నశించును. ఆ తులసీదళముతో కూడినప్పుడే, మనము వండుకొనిన అన్నము మహాప్రసాదము అగును. అట్టి దేవతకు నమస్కరించుంటే మన జీవితసాఫల్యమునకు ఉపకరించును. అని పై శ్లోకముల భావము.

**1. బృందాదేవి –** తులసీదేవికే బృందాదేవి అని మరియొక పేరు ఉన్నది. ఈ తులసి, తోటలు తోటలుగా పెరిగిన ప్రదేశమే శ్రీకృష్ణుని బాల్యవిహార భూమియగు, బృందావన మను పవిత్రప్రదేశము అయినది. ఆ బృందావనమునకు ఈమె అధీశ్వరి కనుక బృందాదేవి అను పేరు వచ్చినది.

2. కేశవు డను నామాంతరముగల శ్రీ మహావిష్ణువుకు ప్రియమైనది కనుక ఈమెకు 1.కృష్ణప్రియ. 2. కేశవప్రియ. 3. విష్ణుప్రియ అను పేర్లు ఏర్పడినవి.

3. భక్తులను అనుగ్రహించుటలో గాని, వారి కష్టములను తీర్చుటలో గాని ఈమెకు తుల అనగా సాటివచ్చువారు మరొకరు లేరు కనుక ఈమెకు తులసి అను పేరు సార్థకమైనది.

4. విష్ణుభక్తిని కలిగించునది కనకు ఈమెకు "విష్ణుభక్తిప్రద" అను నామ మేర్పడినది.

5. తాను సత్యమును పలుకుచు, పాటించుచు ఇతరుల ఉపాసనకు సత్యమైన ఫలమును ఇచ్చునది కనుక ఈమెకు "సత్యవతి" అను పేరు కలిగినది.

6. వండిన పదార్థమును భగవంతునకు నివేదనము చేయవలసి వచ్చినప్పుడు ఆ పదార్థముపై తులసిని వేయు సాంప్రదాయము మనకున్నది. తులసిని ఆయా పదార్థములపై వేయుట వలన అవి భగవత్ ప్రీతికరములైన మహా ప్రసాదములుగా మారుచుండును కనుక తులసికి "మహాప్రసాదజనని" అను పేరు సార్థకమైనది.

7. తనను సేవించినవారందరికి మహాసౌభాగ్యమును (భగవదనుగ్రహమును, అదృష్టమును) కలిగించును కనుక ఈమెకు "సౌభాగ్యవర్ధినీ" అను పేరు ఏర్పడినది.

8. మానవుని శరీరమును పీడించుదానిని "వ్యాధి" అందురు. మానవుని మనస్సును పీడించుదానిని "ఆధి" అందురు. ఆ ఆధి వ్యాధులను తొలగించు మహౌషధి ఈ తులసీదేవి.

అందువలననే ఈమెను "ఆధివ్యాధిహరా" అని మనము ప్రస్తుతించు చుందుము.

ఆ నామములే తులసియొక్క గుణములను మహాత్మ్యమును ప్రకటించుచున్నవి. తులసికి గల 16 ఇతర నామములు 1.తులసీ, 2.శ్రీః, 3. మహాలక్ష్మీః, 4. విద్యా, 5. అవిద్యా, 6.యశస్వినీ, 7.ధర్మా, 8. ధర్మాసనా, 9. దేవీ।, 10.దేవదేవమనఃప్రియా॥, 11. లక్ష్మీః, 12.ప్రియసఖీదేవీ, 13.ద్యౌః, 14. భూమిః, 15.అచలా, 16. చలా।

ఈ పదునారు నామములను పఠించువారు ఐహిక సుఖములను పొంది, దేహమును విడిచిన పిదప శ్రీ మహావిష్ణుపదమును చేరుదురు.

శ్రీ ఎఱ్ఱా సుబ్బారాయుడుగారు తమ "వస్తుగుణదీపిక" అను గ్రంథములో తులసికి గల ఈ క్రింది నామములను కూడా పేర్కొనినారు.

**శ్లో॥ సురసా తులసీ గ్రామ్యా హ్యలసా బహుమంజరీ ।**
**అధీతా రాక్షసీగౌరీ భూతఘ్నీ దేవదుందుభిః।**
**చక్రపర్ణీ నాగమాతా సురభి స్సురమంజరీ ॥**

టీక॥ సురసా, తులసీ, గ్రామ్యా, అలసా, బహుమంజరీ, అధీతా, రాక్షససీగౌరీ, భూతఘ్నీ, దేవదుందుభి, చక్రపర్ణీ, నాగమతా, సురభి, సురమంజరీ యివి తులసి పేరులు అని ధన్వంతరినిఘంటువు పేర్కొనినది.



ఒక్క తులసి ఇందరకు, ఇన్ని ఫలితములను ఎట్లు ఇవ్వగలదు? అను ప్రశ్నకు ఈ క్రింది శ్లోకము సమాధానమును ఇచ్చుచున్నది.

**శ్లో॥ యా దృష్టా నిఖిలాఘసంఘశమనీ, స్పృష్టా వపుఃపావనీ।**
**రోగాణా మభివందితా నిరసనీ, సిక్తాంతకత్రాసినీ ।**
**ప్రత్యాసత్తివిధాయినీ భగవతః కృష్ణస్య సంరోపితా,**
**న్యస్తా తచ్చరణే విముక్తిఫలదా తస్యై తులస్యై నమః**

1. శ్రీ తులసిని చూచినంత మాత్రముననే అది సమస్తపాపములను ఉపశమింపజేయును.

2. తులసిని తాకినచో అది వారి శరీరమును పవిత్రము చేయును.

3. తులసికి నమస్కరించినచో అది వారి రోగములనన్నింటిని తొలగించును.

4. తులసికి నీరు పోసినచో వారికి యమునియొక్క భయమును తొలగించును.

5. తులసిని పెంచినచో వారికి భగవంతుడైన శ్రీ కృష్ణుని మీద అత్యంతమైన భక్తి శ్రద్ధలను పెంచును.

6. తులసీదళములను భగవంతుని పాదముల వద్ద ఉంచినవారికి అవి మోక్షఫలమును ఇచ్చును.

ఇట్టి మహోపకారమును మానవులకు కలిగించునట్టి తులసీదేవికి నమస్కారము చేయుచున్నాను. చేసుకున్నవానికి చేసుకున్నంత మహాదేవ అను సూక్తి ప్రకారము ఏ జీవుడు తులసీదేవికి ఎట్టి సేవను చేయునో, ఆ జీవునకు

ఆమె వాని ఉపాసనకు ఫలితముగా అట్టి ఫలితములనే ఇచ్చునని పై శ్లోకమునందలి భావము.

(సశేషం)

మీరు సంసారము చేయుచున్నారు. ఇందులో నెట్టి దోషమును లేదు. కాని మనస్సును ఈశ్వరుని వైపు నుంచవలెను సుమా! అటుల కానిచో నుపయోగము లేదు. ఒక చేతితో కర్మ చేయుము. ఇంకొక చేతితో ఈశ్వరుని పట్టుకొని యుండుము. పని పూర్తియయిన పిదప రెండు చేతులతో భగవంతుని పట్టుకొనుము. బంధమునకు, ముక్తికి అంతటికి మనసే మూలము. మనస్సును ఏ రంగులో ముంచిన ఆ రంగే అంటుకొనును. మనస్సునకే విధమైన సాంగత్యము కలిగిన అదే విధమైన చింత, బుద్ధి, మాటలు ఏర్పడును. భక్తుని సాంగత్యము కలిగినచో ఈశ్వరచింత, భగవత్ ప్రసంగము మున్నగు వానిపై ధ్యాస కలుగును.

**– శ్రీరామకృష్ణ పరమహంస**

# సూర్యదేవ నమోస్తుతే

**వాడ్రేవు శారద**

## బ్రహ్మవిష్ణుమహేశ్వర రూపమైన ప్రత్యక్ష నారాయణుడు

ఆదిత్యుడు దేవతలలో ప్రధానుడు. పంచాయతన దేవతలలో ప్రథముడు. కర్మసాక్షి. సూర్యుడు లేనిదే ప్రపంచము లేదు. సూర్యుడు లేనిదే ఏ జీవి పుట్టి జీవించజాలదు.

తన తేజస్సుచే జగత్తును ప్రకాశింపజేసి చంద్రునిలో ప్రవేశించి చంద్రకిరణముల ద్వారా ఓషధులను ఉత్పత్తి చేయుచున్నాడు. తద్వారా లోకములో బీజోత్పత్తి జరిగి సృష్టికారకమగుచున్నది.

సర్వజగదుత్పత్తికి హేతువు కనుక అతడు **బ్రహ్మస్వరూపుడు.** సూర్యజనితమైన ఉదకమే నదులుగా రూపొంది, ప్రవహించి, పంటలు పండించి జీవులకు ప్రాణాధారమగుచున్నది. కావున సూర్యుడు స్థితి కారకుడు **విష్ణువు.** సూర్యగమనమున దివారాత్రములు ఏర్పడి కాలచక్రము తిరిగి జీవుల ఆయుఃప్రమాణము తగ్గించును. అతివేడి గాలులు, అతి శీతల పవనములతో జనుల మరణము సంభవించుచుండును. కావున సూర్యుడు లయకారకుడు **మహేశ్వరుడు.** ఉదయము బ్రహ్మగా సర్వసృష్టిని జాగృతి చేసి, మధ్యాహ్నం తమ కార్యకలాపాలు కొనసాగించుటకు వీలు కలుగజేసి విష్ణువుగా, సాయంకాలం తన కిరణములను వుపసంహరించుకొని ప్రపంచమునకు నిశీధిని కల్పించి మహేశ్వరుడుగా విలసిల్లుచున్నాడు. త్రిమూర్తుల రూపమైన ఈ సూర్యభగవానుడు ప్రత్యక్షదైవము.

సూర్యమండలాంతర్గత బ్రహ్మతేజస్సే సర్వ వేదములలో చెప్పబడిన విష్ణువు. ఉదయ మధ్యాహ్న సాయంకాల మందలి సూర్యకిరణ ప్రసారమే త్రివిక్రమాకార అవతారగాధగా వేద వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించిరి. కన్నులకు కనపడువాడు కావున అక్షి స్వరూపుడు. పృథ్వివ్యాపస్తేజో వాయురాకాశాది రజోంశములు సూర్యునికి గల దివ్యతేజస్సుచేతనే జనించినవి. కనుక ఆదిత్యుడు జగత్తుకు మూలకారకుడు. చరాచరముల స్వరూపుడు, ఆత్మయమైనవాడు సూర్యుడు.

ఈతడు **ఇంద్రుడై** దేవతాధిపతి యయ్యెను. **ధాత** యై సృష్టి చేయును. **పర్జన్యుడై** మేఘములను నడుపును. **పూషు** డై వృక్షకోటిని పెంచును. కిరణజన్యసంయోగ క్రియ సూర్యకిరణముల వలనే జరుగును. **ఆర్యము** డుగా జీవుల శరీరములలో వాయువుగా సంచరించును. **భగు** డై భూమి యందుండును. **వివస్వంతు** డను రూపమున జీర్ణక్రియ జరుగుటకు జఠరాగ్నిగా మారును. దేవవైరుల నణచుటకు **విష్ణు** వగును. వాయుచలనమే **అంశుమంతుడు** ప్రాణాధారమైన జలమునందు **వరుణుడు.** ఇవి అన్నియు సూర్యదేవుని క్రియలని సాంబపురాణమునందు చెప్పబడినది.

అగస్త్యుడు శ్రీరామునికి ఉపదేశించిన "ఆదిత్య హృదయ స్తోత్రము"లో వివిధ గుణములతో ఉన్నవానిగా సూర్యుని కీర్తించి నమస్కరించాడు. సూర్యుని గుణములు. ఆదిత్యుడు=అదితి కశ్యపులకు



పుత్రుడు. సవిత=ధ్యానించువారికి సకల శ్రేయస్సులను యిచ్చువాడు. సూర్యుడు= సమస్త ప్రజలను తమతమ కర్మలయందు ప్రవర్తింపజేయువాడు. ఖగుడు=లోకోపకారానికై ఆకాశంలో సంచరించేవాడు. హృదయాకాశంలో ఉండేవాడు. పూషుడు=జగత్తుకు జలములనిచ్చి పోషించేవాడు. గభిస్తిమంతుడు=కిరణములు గలవాడు. స్వర్ణరేతుడు=బంగారము రేతస్సుగా గలవాడు. సహస్రార్చి=వేయి కిరణములు (అనంతకోటి) కలవాడు. మరీచమంతుడు= చక్రాకృతిలో కిరణములు గలవాడు. మరీచి అంటే సుదర్శన చక్రము. శంఖచక్ర గదాధారిని మరీచిమంతుడంటారు. మార్తాండ=మరణించిన అండము నుండి పుట్టినవాడు. అంశుమంతుడు=తన వేడి రశ్మలతో మార్గశిరమాసములోని అధిక చలిని పోగొట్టువాడు. హిరణ్యగర్భుడు=హిరణ్యమును గర్భమున ధరించినవాడు. సర్వజగానికి హితాన్ని కలిగించే రమణీయమైన మనస్సు కలవాడు. భాస్కరుడు=ప్రకాశింపజేయువాడు. పగటిని కలుగజేయువాడు. రవి=సమస్త జనుల చేత స్తుతింపబడేవాడు. అగ్నిగర్భుడు=అగ్నిగర్భము నందు కలవాడు. వ్యోమనాధుడు=ఆకాశానికి అధిపతి. తమోభేది=చీకటిని పోగొట్టువాడు చీకటిని చిలికి వెలుగునిచ్చువాడు. ఋగ్యజుస్సామపారగుడు=మూడు వేదములను పూర్తిగా తెలిసినవాడు. మిత్రుడు=జలములకు మిత్రుడు. ప్లవంగముడు=దక్షిణాయనములలో వింధ్యపర్వత మార్గములో తెప్పవలె వేగంగా సాగేవాడు. ప్రాణాయామము ద్వారా ప్రాణశక్తిని ఉద్దీపన చేసి వెన్నుముకను ఆధారముగా చేసుకొని సాగే నాడుల ద్వారా మూర్ధ్నము నందు ధారణ చేయగలిగినవాడు. తపనుడు=తపింపజేయువాడు. సమస్త బ్రహ్మాండములను ఒకేసారి సంహరింపగలిగినవాడు. మండలుడు=వృత్తాకార బింబము కలవాడు. కిరణముల సమూహముతో వెలుగొందువాడు. మృత్యువు=మృత్యుస్వరూపుడు. కాల స్వరూపములో జీవితాలను హరించేవాడు. శత్రఘ్నుడు=శత్రువులను (మనలో వుండే అరిషడ్వర్గాలను) సంహరించుటకు భయంకరమైన రూపమును ధరించినవాడు. కృతఘ్నఘ్నుడు=చేసిన మేలు మరచిన వానిని చంపువాడు. విశ్వకర్మ=జగత్కర్త, సర్వకర్మలకు కర్త అయినవాడు. కారణభూతుడు. లోకసాక్షి = జనులలో అంతర్యామిగా యుండి వారి యొక్క ప్రతీ కదలికను సాక్షిగా చూచేవాడు. ఈ గుణములను కలిగిన సూర్యనారాయణుని మూడుసార్లు స్తోత్రం చేసి రాముడు నూతనశక్తిని పొంది రావణుని సంహరించాడు.

మూడులోకములు వెలుగునిచ్చువాడు, భుక్తిని, ముక్తిని యిచ్చువాడు, భక్తుల దారిద్ర్యమును తొలగించువాడు, ఆకుపచ్చని గుఱ్ఱములు రథమునకు కలవాడు, హంస వాహనుడు, అంధకారమును నాశనము చేయువాడు, కమలములకు నాధుడు, ప్రియుడు. కమలము హస్తమునందు కలవాడు. సత్వజ్ఞాన స్వరూపుడు, సహస్రకిరణములు కలవాడు, సర్వదుఃఖములను, పాపములను, వ్యాధులను నాశనము చేయువాడు, వేయి నేత్రములు కలవాడు, వేయి విధముల కీర్తింపబడేవాడు, సహస్ర నామములు కలవాడు, నిత్యుడు, నిరవద్యుడు, నిర్మల జ్ఞానమూర్తి, ఆగమముల అర్ధములను తెలియజేసెడివాడు, ఆది అంతములు లేనివాడు, నాదబిందు స్వరూపుడు, వేదములకు మూలమైనవాడు, ధర్మమును చూపేవాడు, మంచిపనులకు సాక్షి, ప్రత్యక్షదేవత, ద్వందమును పోగొట్టేవాడు, తాపత్రయములను పోగొట్టేవాడు, కాలరూపుడు, కళ్యాణమూర్తి, కర్మలకు కారణమైనవాడు, విద్యాస్వరూపుడు, సర్వభయములను సంహరించువాడు అయిన సూర్యనారాయణ మూర్తికి శతకోటి నమస్కారములు.

# వివేక వైరాగ్యములు

సిలువేరు సుదర్శన్

## ఏది నిత్యము - ఏది అనిత్యము

సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపము మనమే అను బ్రహ్మ చైతన్య భావనను ఎల్లప్పుడు అంటిపెట్టుకొని యుండుటకు కృషి సల్పవలెను. దివ్యతత్తమును గూర్చి తెలుసుకోవలెను. దాని ప్రకారముగా జీవించుటకు ప్రయత్నించవలెను. సాధకులు తమ ఆధ్యాత్మిక ప్రయత్నములలో నిర్లక్ష్యము చూపరాదు. "బ్రహ్మనిష్ఠ"లో యుండవలెను. లేనిచో అజ్ఞానంతో కప్పబడే అవకాశముంది.

నీటిపై దట్టముగా క్రమ్ముకొను నాచును తీసివేసినా మరల వెంటనే క్రమ్ముకొనును. ఆత్మ ధ్యాన విముఖుడైన, ఎంత తెలివిగలవాడైనా - మాయ ఆవరించుచునే యుండును.

శంకరాచార్యులవారు పరమ గమ్యమును చేరదలచుకున్నవారు అంతరవలోకన గలవారు కావాలి గాని బాహ్యముఖులై యుండరాదన్నారు. ఆధ్యాత్మికత కొద్దిమంది అర్హులయినవారికి మాత్రమే.

అనేకవేలమంది మనుష్యులలో ఏ ఒకానొకడో మోక్షసిద్ధికై పాటుపడుచున్నాడు. ప్రయత్నించే అనేకమందిలో ఎవరో ఒకరు మాత్రమే పరమాత్మను తెలుసుకొనగలుగుతున్నారు. మంచి సంస్కారము గలవారు మాత్రమే ఆత్మపథము వైపు మరలుతారు.

మేడమెట్ల మీద నుంచి అనుకోకుండా పడిన బంతి ఒక మెట్టు నుంచి మరొక మెట్టు మీదకు దొర్లుతూ, క్రిందకు పడుతుందో ఆ రకంగా బ్రహ్మలక్ష్యము నుండి మనస్సు ప్రక్కకు తొలగి బహిర్ముఖమైననూ మరింత క్రిందకు జారి అధోగతి పాలగును. ఈ పతనం ఆరంభమయ్యాక మనస్సును మరల ప్రారంభస్థానానికి తీసుకురావటం కష్టం. వైరాగ్యముతో పాటు బ్రహ్మనిష్ఠ కలిగియుండాలి. అనాత్మయైన సర్వం నుంచి మనస్సును మరల్చవలెను. ఉన్నతమైన లక్ష్యమును చూపవలెను. బంధరాహిత్యముచే మాత్రమే మన సమస్యను పరిష్కరించలేము.

ఆకాశమునకు ఎగురుటకు పక్షికి రెండు రెక్కలు అవసరమో మోక్ష సౌధాగ్రము చేరుటకు విషయ వైరాగ్యము, ఆత్మజ్ఞానము అనునవి రెండు ఆధారములు. పక్షి ఆకాశంలో ఒక రెక్కతో ఎగురలేదు. ముక్తి కోరువారికి వైరాగ్యము, బోధ రెండూ అవసరమే. బోధయనగా బ్రహ్మనిష్ఠ. నిజతత్వమునకు నిత్యబద్ధులమై యుండవలెను. అప్పుడే విజయము మనదగును.

మనకు వైరాగ్యము అవసరము. ప్రపంచంలోని ఏ విషయమూ నిజమైన సంతోషాన్ని ఇవ్వజాలదు. లౌకిక విషయాల ద్వారా శాశ్వతానందము, అఖండశాంతిని పొందలేము. అంతరంగ ఆత్మ విచారణచే మనస్సును ప్రపంచము నుండి వెనుకకు మరల్చవలెను. నిజమైన సాధన కూడా కావాలి. జీవితం అశాశ్వతమని, తాత్కాలికమని, స్వల్పవ్యవధి కలదని, ఏదో ఒకరోజున మృత్యువాత పడక తప్పదని అనుక్షణం మనం గుర్తించుకోవాలి. అత్యంత సన్నిహితులైన, ప్రియమైన బంధువులు కూడ మనకు తోడుగా రారు. ఇలాంటి భావనలు మనస్సులో కలిగినప్పుడు మాత్రమే మనకు తీవ్రత ఏర్పడి శాస్త్రముల నుండి, నిజమైన గురువు నుండి లక్ష్యము చేరుటకు అవలంబించవలసిన సాధనా మార్గముల గూర్చి, మార్గదర్శక సూత్రాలు తెలుసుకుంటాం. వైరాగ్యయుక్త సాధన పరమగమ్యము చేరుటకు అత్యంత ఆవశ్యకమైయున్నది. ప్రారంభంలో కలిగిన ఆర్తిని స్థిరపరచుకొనినవారే లక్ష్యమును



చేరుకొనగలరు. ముక్తిని పొందవలెనని దృఢమైన దీక్షనే ముముక్షుత్వము అంటారు.

వైరాగ్యము, ముక్తి పొందవలెనను ఆకాంక్ష తీవ్రముగా నుండేవారిలో మాత్రము, శమాదులు సార్థకములై శీఘ్రఫలము నొసంగును. ప్రాపంచిక విషయాలన్ని అసత్యములే. నిజమైన వైరాగ్యము పెంపొందించుకొనకపోతే మోక్షమును పొందలేము. టేబుల్‌కు నాలుగు కాళ్ళుండును. ఒక కాలు వివేకము, రెండవ కాలు వైరాగ్యము, మూడవకాలు షట్సంపత్తి, ఆశ్రమ, దమ, తితీక్ష, ఉపరతి, (శ్రద్ధ, సమాధానము), నాలుగోకాలు ముముక్షుత్వము (ముక్తి పొందవలెనను కోరిక) ముక్తి పొందవలెనన్న కోరిక వుంటేనే గానీ సాధన ఫలవంతమవ్వదు. వివేకానందస్వామి తన ప్రసంగంలో ఇలా అన్నారు. "మార్గము ఎడల జాగ్రత్త వహించినట్లయిన లక్ష్యము ఎడల జాగ్రత్త దానంతట అదే వచ్చును." లక్ష్యమనగా 'ఆధ్యాత్మిక పరిపూర్ణత'. లక్ష్య సాధన మార్గములు - వివేకము, వైరాగ్యము, షట్సంపత్తి, ముముక్షుత్వము. ఈ యాత్ర నిజమైన వైరాగ్యము, ముక్తి కాంక్ష యున్నా ఫలప్రదమగును.

వైరాగ్యమను నీటిలో తడపబడకపోతే హృదయంలో ఆధ్యాత్మిక వికాసము, అభివృద్ధి కలుగదు. హృదయ క్షేత్రాన్ని దున్నవలెను. విజ్ఞులైనవారు, విచక్షణచే హృదయాంతరాళములో ఎరిగి జాగరుకులైయుందురు. ప్రాపంచిక ప్రలోభములకు ఒకవైపు లొంగిపోతూ, మరొకవైపు ఆధ్యాత్మిక మార్గమును అవలంబించుదామంటే, మనల్ని మనం ద్వంద్వ ప్రవృత్తిలో మోసపరచుకున్న వారమవుతాము. మన దృఢమైన నిర్ణయమిలా వుండాలి. "మనము యీ ప్రాపంచిక సుఖాలు అనేక జన్మలనుండి అనుభవించాం. ఈ జీవితంలో కూడా ఇంద్రియ సుఖాలను తెలుసుకున్నాం. మరొకసారి మోసగింపబడకుండా వుండాలంటే దానికి కట్టుబడి జీవించాలి. ప్రతి సాధకుడూ జాగ్రత్త వహించవలెను.

మనస్సును వివేకవంతమైన, ఎఱుకగల, తనంతట తానే అవలంభించు క్రమశిక్షణకు లోను చేయవలెను. జీవ వారసత్వము లేక పూర్వజన్మ కర్మ ఫలితమున పోరాటములో పాల్గొనవలెను. జీవ వారసత్వము నుండి దివ్యవారసత్వపు పరిధిలోనికి మనం పురోగమించవలెను. అది సాధించులోపల సహజముగానే పోరాటము తప్పదు.

"సాధకులందరూ యిటువంటి కష్టజీవనం సాగించవలెను. అందుకై విచారించి, నిరాశ చెందవలదు. సాధనా పోరాటం ఆపవలదు." అభివృద్ధి ఎన్నడూ ఒక తిన్ననైన గీతలాంటిది కాదు. ఆధ్యాత్మిక మార్గము నవలంబించువారు తీవ్ర పోరాటమునకు సంసిద్ధులు కావలెను. అంతర్గతమైన విభేదాలు అనేకం వారిలో తలెత్తుచుండును. ఎదుర్కొని తగిన మూల్యం చెల్లించవలసియుండును. పోరాడుతుంటేను విజయం లభించును. మనము దివ్యతత్వమును గ్రహించి, అనుగ్రహింపబడెదము. అంతిమ విజయం తథ్యం. ఈ మార్గములో కష్టాలను ఎదుర్కోవాలి. తెలివిగా ఎదుర్కొనకపోతే, మానసిక సమస్యలు ఉత్పన్నమగును. కానీ, ఈ పోరాటమును ఇష్టపూర్వకంగా ఎదుర్కొంటే సమస్యలుండవు. కోరికలను బలవంతంగా అణచుట కన్న, వాటిని ఉన్నతముగా మార్చుటకు ప్రయత్నించవలెను. మన కోరికలను భగవంతుని దిశగా మరలించవలెను. స్వయంశిక్షణ (ఆధ్యాత్మిక శిక్షణ) బలవంతంగా అణచివేస్తే, అనేక అవాంఛనీయమైన ఫలితాలను ఎదుర్కోవలసి వుంటుంది. కొందరు "మీకు కోరికలు కలిగితే వాటిని తీర్చుకోండి" అంటారు. దీనిలో గొప్ప ప్రమాదం కలదు. ప్రాపంచిక కోరికల సుడిగుండము నుంచి బయటపడడానికి జీవితమంతా పట్టవచ్చును. బాహ్య ప్రపంచం నామము, రూపం, అస్తి, భాతి, ప్రియములతో కూడి యున్నది. నామరూపములను నిరంతరం వదలిన, విశ్వవ్యాపకమై, సచ్చిదానందస్వరూప బ్రహ్మతత్వమును

గ్రహించగలము. మనమంతా దివ్యాత్మ స్వరూపులమే అయివున్నాము.

వివేకానందస్వామి "ప్రతి మానవుడూ దివ్యాత్మ స్వరూపుడే! దివ్యత్వమును వ్యక్తీకరించుటయే మానవజీవిత లక్ష్యము" అంటారు. పవిత్ర చైతన్యముతో నిర్మింపబడియున్నాము. మన మధ్య భేదము నామ, రూపములలోనే కలదు. జడమైనది గానీ, జీవముతో ఉన్నదిగాని ఐదురకముల స్వభావము కలిగియున్నది. ఉండుట (అస్తి), తెలియబడుట (భాతి), రూపము (రూప) నామ రూపములను తొలగించిన మనము ఒకే పదార్థముచే చేయబడియున్నాం. భగవత్ కృపచే, విచారణ చేసిన అనేకత్వమును వదలి, ఏకత్వములో స్థిరపడగలము. దీనిచే విశ్వమంతా బ్రహ్మచైతన్యముచే నింపబడియున్నట్లు తోచును క్షేమంగా యుందుము. అనంతత్వములోనే నిజమైన ఆనందము కలదు.

లోపలేయున్న పరమాత్మకు భావములనన్నిటినీ ఈ విధంగా చెప్పవచ్చు. "ఓ పరమాత్మ! ప్రాపంచిక సుఖముల వెంబడి పరుగెత్తకుండా సృజించావు. ఎంత హీన సంస్కారాలున్నాయంటే, వాటి నుండి ఉద్ధరింపబడతానన్న ఆశయే లేదు. ఓ పరమాత్మా! సర్వదోషాలు, లోపాలు నీకు తెలుసు. బలహీనతలను, అపరిపూర్ణలతలనూ, లోపాలనూ, అధిగమించే శక్తి నీవే అనుగ్రహించకపోతే, ఉద్ధారమే లేదు. "విశ్వాసముంటే క్షేమంగా వుంటాము. ఈ ప్రపంచాన్నంతా మోసగించగలను గాని పరమాత్మను మోసగించలేను. నిస్సహాయుడిని, అనేక విషయాల వెంట పరుగిడుతున్నాను. తప్పులే మరల, మరల చేస్తున్నాను. నన్ను రక్షించుము. నీకు మాత్రమే తెలుసు!" ప్రార్థన చేస్తే భగవత్ సహాయము లభించును.

నిజతత్త్వములో పైపైన సంబంధము కల్గియున్న మార్పు సాధ్యపడదు. మనదృష్టిని అంతరంగపు లోతులలోనికి పంపాలి. ధ్యానం చేసిన అద్భుత కాంతికిరణం హృదయంలో ప్రవేశించి నీచ సంస్కారములనబడెడి దుమ్ము, ధూళీ, మాలిన్యములను, తాత్కాలికంగా ఒక ప్రక్కకు మనస్సులో త్రోసివేస్తుంది. మనకు బాహ్య నియంత్రణయే గాక, అంతరంగపు నియంత్రణ కూడా కావాలి, విషయములు తొలగుచున్నవే గాని, వాని వాసన పోవుట లేదు. పరమాత్మ దర్శనమైన వాసన కూడా తొలగిపోవును.

మన మనస్సు లోపల వదిలిన విషయములనే పొందవలెనని తీవ్ర ఆకాంక్ష యుండును. అంతరంగపు నియంత్రణ పొందలేదని అర్థము. కానీ, లక్ష్యం సాధించి, నామరూప ప్రపంచము కాధారభూతమైన ఆత్మనిష్ఠ యందు స్థిరముగా నెలకొన్న వారి విషయంలో మటుకు కోరికలన్నీ సంపూర్ణంగా మటుమాయైపోవును. పరమాత్మ దర్శనమైనవారికి వాసనలన్నీ క్షయమగును.

ఇంద్రియములు శక్తివంతంగా, బలవత్తరంగా వుంటాయంటే అవి తమతో పాటు తీసుకొని వెళ్ళి సాధకులైనవారికి పతనాన్ని కలుగజేయును. ఇంద్రియములను స్వాధీనము చేసుకొని స్థిరముగా ఒక సమగ్రమైన, సమన్వయ స్వరూప జీవితమును గడపవలెను. ఆత్మయందే అచంచల శ్రద్ధాభక్తుల కల్గియుండి, అనాత్మ సర్వమును విషమువలె త్యజించవలెను. బాహ్య వైరాగ్యం పొందినవారు ప్రాపంచిక విషయాలను త్యజించి ఒక గుహకో, అడవిలోనికో వెళ్ళవచ్చును కానీ అంతర్గత వైరాగ్యం లేనిచో, ఎచటికి వెళ్ళినా, ఇంద్రియ సుఖముల బంధము, కాంక్ష వదలవు. మనస్సు మోసగించబడును. పరమ గమ్యమును దీక్షగా కృషి చేయవలయును. లేనట్లయినా, ఎవరు రక్షించలేరు. కరుణామయుడు, దయార్ద్ర హృదయుడు శ్రీరామకృష్ణులు గృహస్థ శిష్యునకు ధైర్యం కలిగే విధంగా సమాధానమిచ్చారు. "తప్పక భగవత్ సాక్షాత్కారం పొందవచ్చు. మధ్యస్థ మార్గమును అవలంభించినా పరవాలేదు. మన మనస్సును భగవంతుని దిశకే త్రిప్పవలెను. ఒక చేతితో మన



విధులను నిర్వర్తించవలెను. రెండవ చేతిలో భగవంతుని సేవించవలెను. మన విధి నిర్వహణ పూర్తి అయ్యాక తప్పక మన రెండు చేతులతోనూ భగవంతుని సేవించవలెను.

ఈ పై వాక్యములోని తప్పక అను పదమును మనం గమనించాలి. మన మనస్సును భగవంతుని వైపు మరల్చితే తప్ప విజయం సాధించలేము. "బంధమూ మనస్సుదే – స్వేచ్ఛా మనస్సుదే." "నేను సర్వస్వతంత్రమైన ఆత్మను. నేను ఈ ప్రపంచములో వున్నా, అడవిలో నున్నా ఏ విధంగా బంధింపబడెదను? నేను రాజాధిరాజైన భగవంతుని బిడ్డను. నన్నెవరు బంధింపగలరు?" అని ఈ విధంగా ఎల్లప్పుడూ భావించువారు నిజముగా బంధవిముక్తులై, స్వతంత్రులగుదురు. దృఢమైన దీక్ష నిర్ణయములతో ఎల్లప్పుడూ "నేను బద్ధుడను కాను. స్వతంత్రుడను" అని మననము చేయువారు ఆ విధముగనే స్వతంత్రులై, విముక్తులగుదురు.

# విజ్ఞప్తి - గో సంతతికై గోశాల విస్తరణ

**నమోదేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమోనమః। గవాం బీజ స్వరూపాయై నమస్తే జగదంబికే॥**

**మహాదేవీ, గోబీజ స్వరూపిణి, జగదంబికా। సురభిమాతా, నీకు నమస్కరించు చున్నాను.**

ప్రేమమూర్తులైన, ఆశ్రమ భక్తులకు పూజ్య స్వామి ఓంకార్ మరియు మాతాజీ వారి యొక్క దివ్య ఆశీస్సులు.

మీ అందరి సహకార సంపత్తులతో, ఆశ్రమంలో తలపెట్టిన బృహత్ పథకం అయిన "గోశాల మరియు కృష్ణమందిరం నిర్మాణం", విజయవంతంగా పూర్తి అయ్యి మార్చి నెలలో పూజ్య మాతాజీ దివ్యహస్తములతో ఘనంగా ప్రారంభమయిన విషయం మీ అందరికీ ఇదివరలో పత్రికా ముఖంగా తెలియపరచడమైనది.

ఈ గోశాల నిర్మాణం వలన గోవులు, లేగదూడలు ఎంతో సౌకర్యంగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని తెలుపుటకు చాలా ఆనందంగా వుంది. ఇందుకు గాను సహకరించిన సహృదయులు అయిన భక్తులు అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు మరియు ఆశీస్సులు.

గత సంవత్సర కాలంగా సంఖ్యాపరంగా పెరిగిన లేగదూడలు ఉండుటకు, సేద తీరి, పచ్చిక మేయుటకు, వాటికి ప్రత్యేకంగా, కొంత విశాల ఆవరణతో కూడిన చిన్న షేడ్ నిర్మాణం అవశ్యం అనిపించింది.

ఈ ప్రతిపాదనలో, 100' × 50' అడుగుల కొలతలు గలిగి, ప్రహరీ గోడ, గేటుతో కూడిన ఒక విశాల ఆవరణ, అందులో 20'×40' సైజు గల, ఒక రేకుల షెడ్ మరియు చిన్న నీటి తొట్టి నిర్మించాలని తలపెట్టడం అయ్యింది.

ఈ ప్రతిపాదనకు సుమారుగా రూ. 6.50 లక్షలు కాగలదని అంచనా వేయడం అయ్యింది.

ఈ బృహత్కర నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక దాతలు వారి విరాళములు ధనరూపంలో చెక్కు SBI, కత్తిపూడి **A/c No.11003309435** ఆన్‌లైన్ ద్వారా శ్రీ శాంతి ఆశ్రమం పేరున పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళములకు సెక్షన్ 80జి ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. రూ. 10,000/- కు పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఈ బృహత్తర కార్యక్రమములో వారి వారి శక్త్యానుసారము సహకరించవలసినదిగా మా విన్నపము.

ఓం తత్ సత్

గురుసేవలో **వినమ్రానంద సరస్వతి**

## వార్తలు - మాతృఆశ్రమం

పరమపూజ్యశ్రీ **ఓంకారస్వామి వారి 127వ జన్మదినము, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ వారి** ఆధ్వర్యంలో **స్వామిని వినమ్రానందవారి** నేతృత్వంలో మూడు రోజులు జరుపబడినవి. తేది 19.01.2021 ఉ॥ 5.45 ని॥లకు శాంతి గణపతి సన్నిధిలో దీప ప్రజ్వలన, శాంతి స్థూపములోని ఓంకారస్వామికి పుష్పమాలాంకరణ, ఉ॥ 7.30 ని॥లకు మాతాజీ వారిచే పలాక ఆవిష్కరణలో ప్రారంభమైనది. మూడు రోజులు ఉ॥ 6 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు ఆశ్రమవాసులు ప్రార్థన మందిరంలో జయ జయ రామకృష్ణ హరి ఓం ప్రణవనాదము, హరేరామ మహామంత్రము, శ్రద్ధ భక్తి ఉత్సాహంతో స్మరించిరి.

తేది 21.1.2021 ఉ॥ 6 గం॥ నుండి సా॥ 6 గం॥ల వరకు ఓంకార మందిరంలో శాంతి ప్రార్థన చేసిరి. ఉ॥ 7 గం॥లకు బ్రహ్మచారిణి సుహిత చైతన్య గారు శ్రీ ఓంకారస్వామి పాదుకా అష్టోత్తర శతనామార్చన కావించిరి. స్వామిని వినమ్రానంద వారు స్వామీజీ జన్మదిన సందేశము చదివి వివరించిరి. తదుపరి పూజ్య మాతాజీవారు తమ దివ్యసందేశముతో ఈ విధంగా అన్నారు.

"భగవంతుని యొక్క చర్యలు మన ఊహకు అందనివి. ప్రతి సంవత్సరము స్వామిజీ యొక్క జయంతి అందరి సమక్షంలో ఎంతో ఆడంబరముగా మనం జరుపుకొనుచున్నాము. ఈసారి ఆశ్రమవాసులకు మాత్రమే జరుపుకోవడం భగవంతుని యొక్క లీల. గత 17 సం॥లుగా పూజ్య పద్మనాభానందస్వామి నిరంతరాయంగా స్మామీజీ జన్మదినోత్సవములో పాల్గొంటున్నారు. కాని ఈ సంవత్సరము రాలేకపోయారు. అయినా వారు ప్రతి సం॥ ఆశ్రమానికి అందించే సహకారాన్ని మాత్రం అందించారు. వారిని ఇతర స్వామీజీలను మరియు భక్తులందరిని మనం ఈ క్షణం ఇక్కడ స్మరించుకోవాలి. వారందరు లేకపోయినా వారు మన స్మరణలో వున్నారు. ఆశ్రమ జీవితం గడిపేవారికి కానివ్వండి లేదా ఆధ్యాత్మిక సాధన చేసే వారికి కానివ్వండి. సహనం, పట్టుదల, విశ్వాసం ముఖ్యంగా కావలసినది. ఈ మూడింటిని మన జీవితంలో అలవరచుకుంటే మనం ఏమైన సాధించగలం. ఆశ్రమ జీవితంలోను, ఆధ్యాత్మిక జీవితంలోను ఎన్నో ఆటంకాలు వస్తూ వుంటాయి. సహనం, ఓర్పు, పట్టుదల, విశ్వాసంలో వాటిని అధిగమించగలం. వీటిని వదలకుండా మనం ఆచరణలో పెట్టితే, మనం జీవితంలో విజయవంతులం అవుతాము. ఈ 3 రోజులు ఆశ్రమవాసులు శ్రద్ధతో సాధన చేసి నందులకు సంతోషము. ఈరోజు స్వామీజీ జన్మదినము కారణంగా మన జన్మకు ఆధారమైనది ఏమిటో తెలుసుకొని మన జీవితాన్ని సార్థకం చేసుకోవాలి."

సందేశము అనంతరము "ద మిషన్ ఆఫ్ పీస్-శ్రీశాంతి ఆశ్రమం చరిత్ర" అన్న క్రొత్త పుస్తకాన్ని మాతాజీ ఆవిష్కరించి కమిటీ సభ్యులకు, ఆశ్రమవాసులకు పంచిపెట్టారు. 100 సం॥ల ఆశ్రమ అభివృద్ధికి తోడ్పడిన వారందరి సంస్మరణగా ఈ పుస్తకం రూపుదిద్దుకున్నది. పుస్తకానికి ఆర్థిక సహాయం అందించిన శ్రీ ఆర్.నరసింహరాజు గారికి మాతాజీ కృతజ్ఞతలు తెలిపారు. సా॥ 6-7 గం॥ల ధ్యానముతో, శాంతి ప్రార్థనలో స్వామిని వినమ్రానందవారు స్వామీజీ జన్మదిన వేడుకలను ముగించారు.



## వార్తలు - ఇతర శాఖలలో

**స్వామీజీ 127వ జన్మదినోత్సవం** కోటగిరిశాఖలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, మరియు 10వ తరగతి విద్యార్థులు స్వామీజీని స్మరించుకొంటూ కార్యక్రమము నిర్వహించి, ప్రసాద వితరణ కావించారు. కాకినాడ శాఖలో, ఆశ్రమ భక్తులు రోజంతా శాంతి ప్రార్థన, భజన మరియు పూజ కార్యక్రమాలు జరిపి ప్రసాద వితరణలో ముగించారు. రాచపల్లి గ్రామంలో పల్లపువీధి రామాలయంలో పూజ్యశ్రీ రామస్వామివారు రాత్రి 8-9.30 గం॥ల వరకు ఆ గ్రామ ప్రజల మధ్య ఓంకారస్వామి జన్మదిన కార్యక్రమం నిర్వర్తించారు. పోతులూరు గ్రామంలో ధర్మప్రచారక్ బి. పేర్రాజు గారు ఆ గ్రామ గీతామందిరంలో ఉ॥ 10 గం॥ల నుండి 2 గం॥ల వరకు లోకశాంతి ప్రార్థన ఆ గ్రామస్తులచే చేయించారు.

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
**e-mail : srisanthiashram@gmail.com**

**2. విశాఖ శాఖ :** శాంతి ఆశ్రమము
లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017.
విశాఖపట్నం,
ఫోన్ : 0891 - 2538689
**e-mail : srisanthiashramvsp@gmail.com**

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి-643217, నీలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266-271945
**e-mail : vsvmsktg@yahoo.com**
**vsvmsktg@gmail.com**

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్‌నగర్
కాకినాడ - 533 004.
తూ.గో.జిల్లా.

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టుపేట,
పిఠాపురం - 533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org.in**

## దైవ సాయుజ్యము

గొల్లప్రోలు వాస్తవ్యులు శ్రీ గొల్లపూడి కామేశ్వరరావుగారు (తాతగారు) తేది 12.1.2021 వారి స్వగృహమునందు దైవసాయుజ్యం పొందారు. వీరు ఆశ్రమ చిరకాల భక్తులు, శ్రేయోభిలాషులు. సుమారు 40 సం॥లు పైగా ఆశ్రమానికి అనేక విధాలుగా సేవలందించిన ధన్యజీవి. వీరి ఆత్మశాంతి కోరుతూ ఆశ్రమవాసులు ప్రార్థనలు చేసిరి. వీరు భౌతికంగా లేకపోవడము అనే లోటును భరించే శక్తిని కుటుంబ సభ్యులకు ఓంకారస్వామి ప్రసాదించెదరుగాక!

## కార్యక్రమములు

**తేది 16.2.2021 (మంగళవారం) : "శ్రీపంచమి"** సందర్భంగా **'సరస్వతి పూజ' (ఉన్నత పాఠశాల) ఉ॥ 9 గం॥లకు**

**తేది 18.2.2021 (శుక్రవారం) : "రథసప్తమి"** సందర్భంగా **"శ్రీసూర్య అష్టోత్తర శతనామార్చన" ఉ॥ 7.30 గం॥లకు**

**తేది 18.2.2021 (శుక్రవారం) : శ్రీరామకృష్ణ పరమహంస జయంతి**

**తేది 23.2.2021 (మంగళవారం) : "భీష్మ ఏకాదశి"** సందర్భంగా **శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన (ఉ॥ 7.30 గం॥లకు)**

**తేది 25.2.2021 (గురువారం) : అవతార్ మెహర్‌బాబా జయతి**

## దైవసాయుజ్యం

**తేది 29.12.2020 :** విశాఖపట్నం వాస్తవ్యులు **శ్రీ ఆర్.ఎస్.రాజు గారు** తమ స్వగృహంలో దైవసాయుజ్యం పొందిరి. వీరు ఆశ్రమ శ్రేయోభిలాషులు మరియు కమిటీ మెంబరు. ఆశ్రమానికి అనేక విధములుగా సేవలందించిరి. వీరి ఆత్మశాంతి కోరుతూ ఆశ్రమవాసులు ప్రార్థనలు చేసిరి. వీరి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యమును స్వామి ఓంకార్ ప్రసాదించెదరుగాక!

## విరాళములు

1. శ్రీ శిడగం శివగారు — ఏలేశ్వరం — 5,000.00
   గౌ॥ శ్రీ పర్వత పూర్ణచంద్రప్రసాద్ (ఎమ్మెల్యే, ప్రత్తిపాడు) గారి జన్మదినం సందర్భంగా అన్నదానం
2. శ్రీ గరిమెళ్ళప్రణీత గారు, అఖండ దీపారాధన నిమిత్తం, హైదరాబాదు — 2,900.00
3. శ్రీ రాజు గోవర్ధన్ ఇళ్ళ గారు — పూనా — 3,000.00
4. శ్రీమతి కొలగట్ల మాలతీ గారు — విశాఖపట్నం — 10,000.00
   వీరి భర్తగారు కీ॥శే॥ శ్రీ కొలగట్ల బ్రహ్మాజీరావు గారి జ్ఞాపకార్థం, అన్నదానం
5. శ్రీ చొప్పెర్ల వెంకటేశ్వరరావు గారు — శాంతి ఆశ్రమం — 5,000.00
   గోగ్రాసం నిమిత్తం, వీరి కుటుంబ ఆయురారోగ్యములు కోరుతూ
6. శ్రీ ఎమ్. సుధాకర్ గారు, గోశాలలో తులసివనం పెన్సింగ్ నిమిత్తం, రాజమండ్రి — 3,000.00
7. శ్రీ రెడ్డి వెంకట్రావు గారు — కాకినాడ — 10,000.00
   గోసంరక్షణ – గోగ్రాసం, ఒక ట్రాక్టరు వట్టిగడ్డి నిమిత్తం



8. శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు, బిల్డింగ్ రిపేర్సు నిమిత్తం, శాంతి ఆశ్రమం — 20,000.00
9. శ్రీమతి గవరసాన సుభద్రగారు, గవరసాన కుటీరం మెయింటెనెన్స్ నిమిత్తం, గొల్లప్రోలు — 10,000.00
10. శ్రీ కొత్త నాగేశ్వరరావు గారు, గోగ్రాసం నిమిత్తం మరియు అన్నదానం, వేంపాడు — 8,000.00
11. శ్రీ రావులపూడి అజయ్‌గారు — కత్తిపూడి — 1,020.00
    వీరి తండ్రిగారు కీ॥శే॥ ఆర్. ముత్యాలరావుగారి జ్ఞాపకార్థం
12. శ్రీ ఎమ్. పార్థసారధి గారు, గోగ్రాసం నిమిత్తం, కాకినాడ — 1,120.00
13. శ్రీ వుండవిల్లి బాపిరాజు గారు, 2 ట్రాక్టర్లు వడ్డిగట్టి నిమిత్తం, కాకినాడ — 20,000.00
14. శ్రీ మట్టపల్లి శ్రీనివాసరావు గారు, గోగ్రాసం నిమిత్తం, సామర్లకోట — 5,000.00
15. శ్రీ రామచంద్రా మిషన్ — కాకినాడ — 5,000.00
16. శ్రీమతి సరళగుప్తా గారు — హైదరాబాదు — 11,000.00
    వీరి భర్తగారు కీ॥శే॥ డా॥ భజరంగలాల్ గారి జ్ఞాపకార్థం, అన్నదానం
17. శ్రీమతి సరళగుప్తా గారు — హైదరాబాదు — 12,000.00
    వీరి భర్తగారు కీ॥శే॥ డా॥ భజరంగలాల్ గారి జ్ఞాపకార్థం, వర్కర్సుకు స్టీలు బాక్సుల నిమిత్తం
18. శ్రీమతి చిన్న గుప్తా గారు — హైదరాబాదు — 11,000.00
    వీరి భర్తగారు కీ॥శే॥ శివచరణ్ గుప్తా గారి జ్ఞాపకార్థం అన్నదానం
19. శ్రీమతి వేదుల నిర్మల గారు — సికింద్రాబాదు — 4,00,000.00
    వీరి తల్లిదండ్రులు (లేటు) వి.ఎల్.ఎన్. మూర్తి గారు, (లేటు) శ్రీమతి వేదుల కనకమహాలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం, విద్యానిధి నిమిత్తం
20. శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు — విశాఖపట్నం — 20,000.00
    శ్రీ సిహెచ్.వి. రాజుగారి సమాధికి సిరమిక్ టైల్సు నిమిత్తం మరియు అమర్చుటకు
21. శ్రీమతి కొర్లేపర శాంత గారు, D/o. పద్మ గారు — కాకినాడ — 45,000.00
    బిల్డింగ్ రిపేర్సు (కొత్తవృద్ధుల కుటీరములకు పెయింటు నిమిత్తం)
22. శ్రీ చోడగం నిరంజన్ గారు, అన్నదానం – వస్త్రదానం నిమిత్తం, విశాఖపట్నం — 5,116.00
23. డా॥ పి.సావిత్రి గారు, అన్నదానం – వస్త్రదానం నిమిత్తం, హైదరాబాదు — 3,000.00
24. శ్రీ గంటి కృష్ణ గారు — 25,000.00
25. శ్రీమతి వేల్పూరి సీతాదేవి గారు — విశాఖపట్నం — 33,500.00
    వీరి 80వ పుట్టినరోజు సందర్భముగా అన్నదానం మరియు గిత్తలషెడ్ నిర్మాణమునకు మరియు వస్త్రదానం నిమిత్తం

## శాశ్వత అన్నదానం

1. శ్రీ కొత్త నాగేశ్వరావు గారు — వేంపాడు — 6,000.00
   వీరి తాతగారు కీ॥శే॥ వంకాయల రాజారావు గారి జ్ఞాపకార్థం
2. శ్రీ కోలా వీరవెంకట సత్యప్రసాద్ గారు, వీరి జన్మదినం సందర్భంగా, కాకినాడ — 10,000.00
3. శ్రీమతి కోలా సూర్యలత గారు, W/o. కోలా వీరవెంకట సత్యప్రసాద్ గారు, కాకినాడ — 10,000.00
   వీరి జన్మదినము సందర్భముగా
4. శ్రీ రవి గుప్తా గారు, వీరి పుట్టినరోజు సందర్భముగా, హైదరాబాదు — 10,000.00
5. శ్రీమతి బొగ్గవరపు రత్నకుమారి గారు — హైదరాబాదు — 15,000.00
   వీరి భర్తగారు కీ॥శే॥ బి.వి.వి.ఎస్. మూర్తి గారి జ్ఞాపకార్థం
6. శ్రీమతి పి.హెచ్.ఎస్. వాణిగారు, కీ॥శే॥ పేరాబత్తుల కృష్ణమూర్తి గారి జ్ఞాపకార్థం, హైదరాబాదు — 20,000.00